ప్రజాగొంతుక మూగబోవడం బాధాకరం

- ఎంఎల్‌సి సాబ్జీ సంస్మరణ సభలో శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 149 | విజయవాడ, సోమవారం 1 జనవరి 2024 | 6 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Monday 1 January 2024 | Rs



కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిడ్నీలోని ఒపెరా హౌస్ హార్బర్ వంతెన వద్ద మిరిమిట్లు గొలిపే బాణా సంచా వెలుగులు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు ప్రజాశక్తి

2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు

– సంపాదకులు

అడవిపై గొడ్డలి వేటు!

- ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ ప్రాంతాల్లో బొగ్గు మైనింగ్
- అదానీ కంపెనీలకు నిక్షేపాల అప్పగింతకు బిజెపి ఆత్రం
- తొలి గిరిజన సిఎం హయాంలో మన్యం బిడ్డలకు, పర్యావరణవేత్తలకు బెదిరింపులు



ఛత్తీస్‌గఢ్ సర్‌గుజా జిల్లా హస్‌దియో అరంద్ అడవుల్లో నరికివేతకు గురైన చెట్టు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బిజెపి అదానీ కంపెనీలకు బొగ్గు నిక్షేపాలను కట్టబెట్టేందుకు ఆత్రం ప్రదర్శిస్తోంది. ఆదివాసీ ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాలకు అనుమతించడంపై గిరిజనులు, పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. డిసెంబర్ 21న డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాత టిజి అజయ్‌ని, అటవీ వనరుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ కన్వీనర్ అలోక్ శుక్లాను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి, విడిచిపెట్టారు. సర్‌గుజా జిల్లాలో కొందరు అటవీ కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. రాష్ట్రంలో జీవవైవిధ్య ప్రాంతమైన హస్‌దియో అరంద్‌లో అడవుల నరికివేత పనులను అడ్డుకోవద్దంటూ పోలీసులు గ్రామస్తులను బెదిరింపులకు గురిచేశారు. ఈ వార్తలను పోలీసులు తోసిపుచ్చినప్పటికీ ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో కార్పొరేట్ రాజ్ ప్రారంభానికి ఓ సంకేతమని పలువురు వ్యాఖ్యానించారు. వివాదాస్పద అటవీ భూములు మూడు జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. వీటిపై ప్రభుత్వ మద్దతున్న మైనింగ్ కంపెనీలు కన్నేశాయి. ప్రధానంగా అదానీ గ్రూపు రంగంలో దిగింది. రాష్ట్రంలోని 3.7 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను సొంతం చేసుకోవాలని ఆ గ్రూపు లక్ష్యంగా పెట్టుకుంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం 2022లో 41 హెక్టార్ల విస్తీర్ణంలోని చెట్లను కూల్చివేశారు. 2023 నవంబరులో మరో 93 హెక్టార్లలో చెట్ల కూల్చివేతకు అనుమతులు ఇచ్చారు.

ఇటీవల బిజెపి గెలుపొందడంతో, రాష్ట్ర ముఖ్యమంత్రిగా గత నెల 13న విష్ణుదేవ్ సాయి బాధ్యతలు చేపట్టారు. ఆ నాటి నుంచి అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య చెట్ల నరికివేత పనులు నిరాటంకంగా సాగిపోతున్నాయి. గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్ శాసనసభ చెట్ల నరికివేతను నిరసిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన విషయం తెలిసిందే. అడవుల నరికివేతపై పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. పైగా దేవ్ సాయి రాష్ట్రానికి తొలి గిరిజన ముఖ్యమంత్రి. బొగ్గు తవ్వకం, చెట్ల నరికివేత గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలేనని, ఇప్పుడు జరుగుతున్న పనులు వాటికి కొనసాగింపేనని ఆయన వివరణ ఇస్తున్నారు.

ఆదివాసీల నిర్బంధం చట్టవిరుద్ధం, ప్రమాదకరమని ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ కన్వీనర్ అలోక్ శుక్లా వ్యాఖ్యానించారు. నిరసన గళం విన్పించిన అనేక మందిని నిర్బంధించారని ఆయన తెలిపారు. కొన్ని సందర్భాలలో అయితే పోలీసులు వారిని బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా ఇళ్ల నుండి తీసుకెళ్లారని తెలిపారు. నవంబర్ 28న శుక్లా నేతృత్వంలో రాజధాని రాయ్‌పూర్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు మెమొరాండాలు అందజేశారు. ఆదివాసీల హక్కుల రక్షణలో జోక్యం చేసుకోవాలని వాటిలో కోరారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో సర్‌గుజా జిల్లాలోని మొత్తం 14 స్థానాలనూ బిజెపియే గెలుచుకుంది. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేస్తూ పలు గ్రామాలలో గ్రామసభలు నిరసన వ్యక్తం చేసినప్పటికీ అటవీ భూమిని తవ్వకాలకు ధారాదత్తం చేశారు. కొన్ని గ్రామ సభలను మైనింగ్ కంపెనీలే నిర్వహించి తీర్మానాలు ఆమోదించాయి. వాటిపై గత గవర్నర్ విచారణకు ఆదేశించారు కూడా. అయినప్పటికీ పోలీసు రక్షణలో మైనింగ్ పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి.



16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా అరవింద్ పనగరియా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. రిత్విక్ రంజనం పాండేను కమిషన్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. 16వ ఆర్థిక సంఘం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒఆర్)ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం గత నెలలో ఆమోదించింది. ఐదేళ్ల కాలానికి (2026-27 నుంచి 2030-31) సంబంధించిన రిపోర్టును 2025 అక్టోబరు 31లోగా రాష్ట్రపతికి కమిషన్ సమర్పించాల్సి ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ, ఆదాయం పెంపుదలకు సంబంధించిన చర్యలను ఆర్థిక సంఘం సూచిస్తుంది. ఫైనాన్సింగ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లపై కూడా సమీక్ష జరుపుతుంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై సలహాలు ఇచ్చే రాజ్యాంగ వ్యవస్థగా ఫైనాన్స్ కమిషన్ ఉంటుంది. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి దాని స్థానంలో తీసుకొచ్చిన నీతి ఆయోగ్‌కు తొలి ఛైర్మన్‌గా అరవింద్ పనగరియాను 2015లో మోడీ సర్కారు నియమించింది. పనగరియా న్యూయార్క్‌లోని కొలంబియా వర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేయడంతోపాటు ఎడిబి, వరల్డ్ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒలో వివిధ హోదాల్లో పనిచేశారు.

నిర్బంధాలతో అణచలేరు

- పోటీ కార్మికులతో పనులు చేయించొద్దు
- కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల సమస్యను సానుభూతితో పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. పోలీసుల సాయంతో పోటీ కార్మికులను ఆదివారం కూడా రంగంలోకి దింపింది. గ్యారేజీల నుంచి వారు చెత్త వాహనాలను బయటకు తీస్తుండగా సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ పక్కకు లాగిపారేశారు. పలువురిని అరెస్టు చేశారు. ప్రభుత్వ తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్బంధాలతో సమ్మెను ఆపలేరని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కంచాల్సిన ప్రభుత్వం పోటీ కార్మికులను తీసుకురావడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె ఆరో రోజుకు చేరింది.

విశాఖలో కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రాగా కార్మికులు అడ్డుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి ధర్మశ్రీ స్పందిస్తూ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జివిఎంసి ఏడో వార్డు పరిధిలోని నగరంపాలెం రహదారిలో కంఫర్ట్ బిన్ వాహనాలను పోలీసుల సమక్షంలో పోటీ కార్మికులు బయటకు తీసేందుకు యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, సిఐటియు నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి రాజ్‌కుమార్, సూరిడమ్మ అస్వస్థతకు గురయ్యారు. ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కొద్దిసేపటి తరువాత విడిచిపెట్టారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో అధికారులు పోటీ కార్మికులతో పారిశుధ్య పనులు చేయిస్తుండగా సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. వారిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. మహిళలని కూడా చూడకుండా రోడ్డుమీద ఈడ్చివేశారు. ఈ క్రమంలో ఉమా, కుమారి అనే మహిళా కార్మికులు సొమ్మసిల్లి పడిపోయారు. 11 మంది కార్మికులను అరెస్టు చేసి టుటౌన్ స్టేషన్‌కు తరలించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అధికారులు వంద మందికిపైగా పోటీ కార్మికులు విధుల్లోకి రాగా మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు.



ప్రకాశం జిల్లాలో తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయిన కార్మికురాలు

పోటీ కార్మికులను పనిలోకి తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్మికుల డిమాండ్‌ను పట్టించుకోకుండా మున్సిపల్ కమిషనర్ కారు ఎక్కి వెళ్లిపోతుండగా మున్సిపల్ కార్యాలయానికి గేట్లు మూసి అడ్డుకున్నారు. పలువురు కార్మికులు ట్యాంక్‌పైకి ఎక్కి నిరసన తెలిపారు. పోటీ కార్మికులతో పని చేయించబోమని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. పిడుగురాళ్లలో పోటీ కార్మికులతో పనిచేయిస్తుంటే సమ్మెలో పాల్గొన్న కార్మికులు అడ్డుకున్నారు. అనంతపురంలో చెత్తను తొలగించేందుకు ప్రయివేటు వ్యక్తులు రాగా కార్మికులు అడ్డుకొని పంపేశారు. ప్రయివేటు వ్యక్తులతో చెత్తను తరలించే ఏర్పాటు చేస్తే కార్పొరేషన్ కార్యాలయంలోనే చెత్తను వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో చెత్త తొలగించేందుకు వచ్చిన కమిషనర్‌ను మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. కర్నూలు జిల్లా గూడూరు మున్సిపాలిటీ దగ్గర మున్సిపల్ కార్మికులు ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ప్రయివేటు సిబ్బందిని మున్సిపల్ కార్మికులు అడ్డుకోవడంతో వారి మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తోపులాటలో సిఐటియు నాయకులు మహేష్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నెల్లూరులో సమ్మెను భగ్నం చేసేందుకు కార్పొరేషన్ అధికారులు కార్మికులపై కక్ష సాధింపులు, బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం విధుల నుంచి తొలగిస్తామంటూ 12 మందికి నోటీసులు జారీ చేశారు. శ్రీకాకుళం, కడప, తిరుపతి, నెల్లూరు, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో నోటికి నల్ల రిబ్బన్లు, అర్ధనగ్న ప్రదర్శన, మోకాళ్లపై కూర్చొని, గడ్డితింటూ నిరసన తెలిపారు.

'పోరాడుదాం... ఆంధ్ర'

- ఆట, పాటలతో అంగన్‌వాడీల నిరసన
- 20వ రోజూ కొనసాగిన సమ్మె



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 216 జాతీయ రహదారిపై క్రికెట్ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీల సమ్మె 20వ రోజూ కొనసాగింది. ఆదివారం ఆట, పాటలతోపాటు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఖరిని, తప్పుడు ప్రచారాలను నిరసించారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ ఎన్ని రోజులైనా సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. అనకాపల్లి జిల్లా మునగపాకలో సమ్మె శిబిరం వద్ద 'ఆడుదాం-ఆంధ్ర'కు దీటుగా 'పోరాడుదాం-ఆంధ్ర' పేరుతో ముఖ్యమంత్రి ఫేస్ మాస్కులతో కోలాటం నిర్వహించారు. అనకాపల్లిలో ముఖ్యమంత్రి జగన్, మంత్రులు ఉషశ్రీ చరణ్, బొత్స సత్యనారాయణ మాస్కులు ధరించి 'ప్రభుత్వంతో ఆడుదాం అంగన్‌వాడీ' కార్యక్రమం నిర్వహించారు. కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు ఆడారు. బుచ్చయ్యపేటలో ఆటపాటలతో, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరులో కోలాటం, థింసా నృత్యంతో నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయం, ఆలూరులో కబడ్డీ ఆడారు. నంద్యాల జిల్లా మిడుతూరు, కొలిమిగుండ్లలో కబడ్డీ, బనగానపల్లెలో కుర్చీలాట, పాములపాడులో కబడ్డీ, ఖోఖో ఆడి, నంద్యాలలో సిఎం, మంత్రుల ఫొటోలు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. తిరుపతిలో మంత్రుల ఫొటోలను మాస్క్‌గా ధరించి 'ఆడుదాం మంత్రులతో కబడ్డీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో కోలాటాలు, కార్వేటినగరంలో ఆటపాటతో నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లోని అంగన్‌వాడీ సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలతో ఆట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం, ఆచంట, అత్తిలి, పెనుమంట్ర, పోడూరు, తాడేపల్లిగూడెం, గణపవరం, మొగల్తూరులో అంగన్‌వాడీలు సమ్మె శిబిరాల వద్ద ఆటలు ఆడి, పాటలు పాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి, మండవల్లి, పోలవరం మండలాల్లో 20 రోజుల సమ్మెలో భాగంగా 20 అక్షరం ఆకారంలో కూర్చొన్నారు. మ్యూజికల్ ఛైర్స్, ఆటపాటలతో, కలిదిండిలో సమ్మె శిబిరం వద్ద కేక్ కట్ చేసి, జంగారెడ్డిగూడెంలో రేలారేలా నృత్యంతో, ముసునూరులో ఒంటి కాలుపై నిల్చుని నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో

మిగతా 2లో

బాలికపై గ్యాంగ్ రేప్


- పోలీసుల అదుపులో పది మంది నిందితులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల బాలికపై పది మంది యువకులు అత్యాచారం చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక కుటుంబం విశాఖలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉంటోంది. ఆ కుటుంబంలోని బాలిక తన ప్రియుడిని కలిసేందుకు విశాఖలోని ఓ లాడ్జికి డిసెంబర్ 17న వెళ్లింది. అక్కడ ఆమెపై ప్రియుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అతను స్నేహితుడు బెదిరించి బాలికపై అత్యాచారం చేశాడు. ఈ సంఘటనతో భయాందోళనకు గురైన యువతి విశాఖ ఆర్కే బీచ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఏడుస్తూ ఉండగా ఓ ఫొటోగ్రాఫర్ చూశాడు. ఆమెను ఓదార్చి, మాయమాటలు చెప్పి తన స్నేహితుల గదికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిని వీడియోలో చిత్రీకరించాడు. ఈ వీడియోనూ సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించి అతని స్నేహితులు ఏడుగురు డిసెంబర్ 22వ తేదీ వరకూ వివిధ లాడ్జిల్లో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో, మరింత భయాందోళనకు గురైన ఆ బాలిక తన సొంత ఊరైన ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా మహేంద్రా గ్రామానికి వెళ్లిపోయింది. తన కూతురు కనిపించట్లేదని బాలిక తండ్రి డిసెంబర్ 18న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక ఒడిశాలోని సొంత ఊరులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు, బాలిక తల్లిదండ్రులు అక్కడకి వెళ్లి ఆమెను విశాఖ తీసుకొచ్చారు. అప్పటికే మానసికంగా కుంగిపోయిన ఆ బాలిక జరిగిన పరిణామాలపై డిసెంబర్ 30 వరకూ ఎటువంటి విషయాలూ వెల్లడించలేదు. 31న తన తల్లిదండ్రులకు విషయాలు చెప్పడంతో వారి సమాచారం మేరకు పోలీసులు బాధిత బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. పది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసును డిసిపి-1 కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలుపెరుగని కలం యోధుడు

జాన్ పిల్జర్ కన్నుమూత



లోపలి పేజీలో..

నేటి నుంచి రూ.3 వేల పింఛన్

- 8 వరకు మహోత్సవాలు
- మంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నవరత్నాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు సోమవారం నుంచి రూ.3 వేల పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఉన్న రూ.2,750 పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని మండల, మున్సిపల్ హెడ్ క్వార్టర్స్‌లో జనవరి 1 నుంచి 8 వరకు పెన్షన్ పెంపు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3న కాకినాడలో జరిగే పెన్షన్ మహోత్సవంలో సిఎం జగన్ పాల్గొంటారన్నారు. కొత్తగా 1,17,161 మందికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. మొత్తం పెన్షన్ల పంపిణీకి ఇప్పటికే రూ.1,968 కోట్లు విడుదల చేశామన్నారు.

జాయింట్ ఎల్‌పిఎమ్‌లతో చిక్కులు

- తలలు పట్టుకుంటున్న రైతులు
- సర్వేయర్లపై సర్కారు నెపం
- ఆర్‌ఒఆర్ అభ్యంతరాలపై అప్పీల్‌కు ఏడాది గడువు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పిఎమ్‌లు రైతులకు చిక్కులు తెచ్చిపెట్టింది. రీ సర్వే గ్రామాల్లో ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పిఎమ్) జాయింట్‌గా చేయకూడదని సర్వే తొలిదశలో స్పష్టం చేయకపోవడంతో అనేక గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు రైతుల మొదలు కొన్ని చోట్ల పది మందికి కూడా జాయింట్ ఎల్‌పిఎమ్‌లు తయారుచేశారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదురుతిరగడంతో ఆ నెపాన్ని గ్రామ సర్వేయర్లపై నెట్టేందుకు ప్రభుత్వం పూనుకోవడం గమనార్హం. ఇందులో భాగంగానే జాయింట్ ఎల్‌పిఎమ్‌లపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని మౌఖికంగా ఆదేశించింది. వారి సమాధానం సరిగ్గా లేకపోతే కొందరు సర్వేయర్లపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

భూములు రీ సర్వే చేస్తున్న గ్రామాల్లో జాయింట్ ఎల్‌పిఎమ్‌లు సృష్టించడంతో ఆయా భూములకు సంబంధించి సర్వే నెంబర్లు రైతులకు ఉమ్మడిగా వస్తున్నాయి. వేర్వేరుగా రావడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో భూ యజమానుల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. బ్యాంకు లోన్లు, ప్రభుత్వ సబ్సిడీలు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు, ప్రజా సంఘాలు, రైతు సంఘాల ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి, అర్జీల రూపంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. వీటిపై స్పందించిన ప్రభుత్వం రైతులు జాయింట్ ఎల్‌పిఎమ్‌లకు అంగీకరిస్తేనే అలా చేయాలని, లేని పక్షంలో వ్యక్తిగతంగా సర్వే నెంబరు, సబ్ డివిజన్ వారీ ఎల్‌పిఎమ్ నెంబర్లు కేటాయించాలని పేర్కొంది. ఈ విషయంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపింది. ఇందులో భాగంగా జాయింట్ ఎల్‌పిఎమ్‌లు ఎందుకు సృష్టించాల్సి వచ్చింది? ఆయా సర్వే నెంబర్లకు సంబంధించి భూ యజమానులు జాయింట్ ఎల్‌పిఎమ్‌లు చేసేందుకు అంగీకరించారా? లేదా? ఒక వేళ భూ యజమానులు అంగీకరించని పక్షంలో ఎటువంటి పరిస్థితుల్లో అలా చేయాల్సి వచ్చిందో ప్రొఫార్మాలో అన్ని కాలమ్స్‌ను పూర్తి చేసి జాయింట్ ఎల్‌పిఎమ్‌లకు కేటాయించిన నెంబర్ల వారీ గ్రామ సర్వేయర్లు లిఖితపూర్వక వివరణలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. వివరణ పట్ల సంబంధిత ఆర్‌డిఒ సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సంతకం చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటుంది. అయితే రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందికి టార్గెట్లు పెట్టడంతోపాటు రికార్డుల్లో ఎంట్రీలు వేసే సమయం ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తప్పులు దొర్లినట్లు రెవెన్యూశాఖలో చర్చ నడుస్తోంది.

మమ్మల్ని దోషులుగా చూపే యత్నం : గ్రామ సర్వేయర్లు

భూముల రీ సర్వే ప్రారంభ దశలో సరిపడా సమయం ఇవ్వకుండా త్వరితగతిన టార్గెట్లు పూర్తి చేయాలంటూ తమ మెడపై కత్తి పెట్టినట్లు ప్రభుత్వం, ఉన్నతాధికార్లు ఒత్తిడి చేశారని గ్రామ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు ఎన్‌ఆర్‌ఐలు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న

మిగతా 2లో

జనగణన మళ్లీ వాయిదా

● అక్టోబర్ వరకూ లేనట్లే

న్యూఢిల్లీ : జిల్లాలు, తాలూకాలు, పట్టణాలు, మున్సిపల్ సంస్థలకు పరిపాలనా సంబంధమైన సరిహద్దులు నిర్ణయించేందుకు గతంలో విధించిన గడువును కేంద్రప్రభుత్వం వచ్చే సంవత్సరం జూన్ 30 వరకూ పొడిగించినట్లు భారత అదనపు రిజిస్ట్రార్ జనరల్ శనివారం రాష్ట్రాలకు సమాచారం పంపించారు.

ఈ గడువు పొడిగింపు ఇది తొమ్మిదోసారి. ఈ నేపథ్యంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ కనీసం వచ్చే ఏడాది అక్టోబర్ వరకూ వాయిదాపడే అవకాశం ఉంది. ఈ దశాబ్దపు జనగణన తొలి దశ 2020 ఏప్రిల్ 1న ప్రారంభం కావాల్సి ఉండగా, కోవిడ్ కారణంగా కేంద్రం వాయిదా వేసింది. ఆ తర్వాత కారణం చెప్పకుండానే వాయిదా వేస్తోంది. ప్రభుత్వం చెబుతున్నట్లు 2024 జూన్‌లో (సరిహద్దుల నిర్ణయం తర్వాత) ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ ఎన్యూమరేటర్ల జాబితాను రూపొందించడానికే మూడు నెలల సమయం పడుతుంది. అంటే లోక్‌సభ ఎన్నికలలోగా జనగణన కసరత్తు ప్రారంభమయ్యే అవకాశాలు లేవు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో తీవ్ర నష్టం జరుగుతుందని, విశాఖ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1053వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రయివేటీకరణ అయితే ఒక్క ఉద్యోగులే కాకుండా అందరూ నష్టపోతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచించడం వల్లే ప్లాంట్‌కు ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉంటేనే ప్లాంట్‌కు మనుగడ ఉంటుందన్నారు. మరో చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై కడవరకూ పోరాటంలో నిలవాలని కోరారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళికలు రచించామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కొవిరి అవతారం, నగేష్, కారు రమణ, మంత్రి శంకర నారాయణ, పివి రామచంద్రరావు, కె శ్రీనివాసనాయుడు, పల్లం గోపి. డి యల్లాజీ రావు, వివి కృష్ణనాయుడు, భాస్కరరావు, గంగవరం గోపి, ఎంఎస్‌ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.




సాబ్జీ సంస్మరణ సభలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, చిత్రంలో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్.ప్రసాద్ తదితరులు

ప్రజాగొంతుక మూగబోవడం బాధాకరం

ఎంఎల్‌సి సాబ్జీ సంస్మరణ సభలో శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

ప్రజశక్తి- తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతోపాటు ప్రజా సమస్యలపై గళమెత్తిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గొంతుక మూగబోవడం బాధాకరమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్లో యుటిఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మదుస్వభావి, స్నేహశీలి, చిరునవ్వుతో అందరితో ఆప్యాయంగా ఉండే సాబ్జీ లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నామన్నారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాబ్జీ భౌతికంగా మన మధ్యలో లేకున్నా ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాటాలు చేయడమే సాబ్జీకి అర్పించే నిజమైన నివాళని పేర్కొన్నారు. సాబ్జీ మరణం ప్రజాతంత్ర, అభ్యుదయ, ప్రగతిశీల ఉద్యమాలకు తీరని లోటన్నారు. సాబ్జీ ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు, యుటిఎఫ్ శ్రేణులకు తెలియజేయాలని జిల్లా ఎస్‌పి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరే సాబ్జీకి ఘననివాళని అన్నారు. యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఉద్యోగ సంఘాల జిల్లా జెఎసి చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు హరినాథ్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, సీనియర్ నేతలు ఎస్ జయప్రభ, ఎం.రామకృష్ణ, పివి నరసింహారావు, ఉమ్మడి జిల్లాల నేతలు ఆర్.రవికుమార్, షేక్ అలీ, పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ప్రజాసంఘాల నేతలు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, సాబ్జీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బిజెపి వ్యతిరేక శక్తులు ఏకం కావాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి వ్యతిరేక శక్తులు ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో నిర్వహించిన సమాలోచన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావ సారూప్యత కలిగిన పార్టీల నాయకులు ఒకే తాటిపైకి వచ్చి బిజెపితోపాటు దీనికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఇండియా వేదికకు నేతృత్వం వహించే కాంగ్రెస్ పార్టీ సారథి బాధ్యతతో ముందుకు నడవాలని తెలిపారు. మోడీ ప్రభుత్వ హయాంలో సమాజిక న్యాయం అనేది లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటైజేషన్ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర బిజెపితో అంటకాగుతున్నాయన్నారు. జనవరి 12న రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 2 వేల మందితో భారీ సదస్సు నిర్వహించనున్నామని, అందరూ హాజరుకావాలని కోరారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. బిజెపి భావజాలానికి, జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రజాస్వామ్య వాదులు కలిసి సమాలోచన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో బిజెపి, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం హక్కులను హరిస్తున్నాయన్నారు. దళితులపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ.. భావ సారూప్య కలిగిన రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి కేంద్రంలో బిజెపిని ఓడించాలన్నారు. అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలు బిజెపి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయని విమర్శించారు. ఎఐసిసి కార్యదర్శి జెడి శీలం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను వదిలి వెళ్లిన బడుగు, బలహీనవర్గాల ప్రజలు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. జనవరి 2 నుంచి 11 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన, క్రిస్టియన్ సమస్యలపై జిల్లా స్థాయిలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్రాంతి తరువాత అభ్యర్థుల ఖరారు

● 90 సీట్లపై టిడిపి కసరత్తు పూర్తి! ● జనసేనకు 25?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాజకీయ వేడి మొదలైంది. మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అధికార వైసిపి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉంది. సంక్రాంతి తరువాత అభ్యర్థులను ప్రకటిస్తామని టిడిపి అగ్రనాయకత్వం చెబుతోంది. 90 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు పూర్తయిందని, వారిని నియోజకవర్గాల్లో పనిచేసుకోవాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని చెబుతున్నారు. గ్రూపు విభేదాలున్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాల్సి ఉందని అంటున్నారు. నేతల మధ్య అధిపత్య పోరును పరిష్కరించడంలో అగ్రనాయకత్వం అలసత్వం వహిస్తోందనే విమర్శ ద్వితీయస్థాయి నేతల్లో ఉంది. సుమారు 140 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను అధినేత ప్రకటించారు. వారే అభ్యర్థులు కారని, పరిస్థితులను బట్టి మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. ప్రకాశం జిల్లాలో దర్శి మినహా మిగిలిన అభ్యర్థుల ఎంపిక దాదాపు కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో అంతర్గత కుమ్ములాట ఎక్కువగా ఉందని చెబుతున్నారు. గుంటూరు జిల్లా నరసారావుపేట, ప్రత్తిపాడు, గుంటూరు ఈస్ట్, వెస్ట్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో విజయవాడ పశ్చిమ, తిరువూరు నియోజకవర్గాలకు ఇప్పటి వరకు ఇన్‌ఛార్జులు లేరు. మిత్రపక్షమైన జనసేన 35 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రతిపాదించినట్లు నేతలు చెబుతున్నారు. 25 సీట్లు ఇస్తామని టిడిపి అగ్రనాయకత్వం చెప్పినట్లు తెలుస్తోంది. గోదావరి జిల్లాల్లో జనసేనకు ఎక్కువ సీట్లు ఇచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సర్దుబాటులో భాగంగా ఈ జిల్లాల్లో కొంతమందిని నియోజకవర్గాలు మార్చే అవకాశముందని టిడిపి నేతలు చెబుతున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని ఎలా సర్దుబాటు చేయాలనే అంశం కూడా ఉంటుందని అంటున్నారు. వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికే టిడిపి సీటు ఇస్తుందని అంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల గడువు చివరి వరకు అభ్యర్థులను అధినేత తేల్చరనే అభిప్రాయం కూడా కొందరిలో నెలకొంది. ఈసారి అందుకు భిన్నంగా ఉంటుందని, సంక్రాంతి తరువాత అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని అంటున్నారు.

నూతన ఏడాదిలో ఉజ్వల భవిష్యత్తు

● గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2024 నూతన సంవత్సరం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురుచూడటానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, కొత్త లక్ష్యాలను సాధించడానికి స్ఫూర్తినిస్తుందని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజలందరూ ఉల్లాసంగా, సంతోషం, శాంతి, శ్రేయస్సుతో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలూ, సామాజికవర్గాలూ సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణించేలా కృషి చేస్తున్న ప్రభుత్వానికి, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

త్వరలో మేనిఫెస్టో

● రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన కలిసి రాష్ట్ర దశ, దిశ మార్చివేసే మలివిడత సమగ్ర మేనిఫెస్టోను త్వరలోనే ప్రకటించబోతున్నామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపైన సాగే సుపరిపాలన కోసం, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం సమగ్ర పథక రచన చేస్తున్న సంగతి అందరికీ తెలుసునని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీలతో తొలివిడత మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. నూతన సంవత్సరంలో మరో వంద రోజుల్లో ఆటవిక పాలన నుంచి తెలుగు ప్రజలకు విముక్తి కల్పిస్తానని హామీ ఇస్తున్నానని అన్నారు. నూతన సంవత్సరంలో హింసకు, అవినీతికి, అశాంతికి, అక్రమాలకు, అమానుషానికి తావులేని ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పటిష్టమైన పునాదులు వేద్దామని ప్రతిన పూనాలని కోరారు.

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్ర ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం రోజున వీధుల్లోనే ఉండి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగ, కార్మిక సోదరులందరికీ శుభాకాంక్షలు. వారి పోరాటం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించి, అందరూ సంతోషంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.

'కొలికపూడి'పై సిఐడి వేధింపులు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి అధ్యక్షులు, దళిత నేత కొలికపూడి శ్రీనివాసరావును సిఐడి పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేధిస్తోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తున్న నేతపై వేధింపులకు పాల్పడటం జగన్ దమనకాండకు నిదర్శనమని ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ ప్రభుత్వాన్ని పారిశుధ్య కార్మికులే ఊడ్చి పారేస్తారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. కరోనా కష్ట సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన కార్మికులతో సర్కారు చెలగాటమాడుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాజకీయ హక్కుల కోసం పోరాటం

● ఎపి ముదిరాజ్ మహాసభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ముదిరాజ్‌లంతా ఐక్యంగా రాజకీయ హక్కుల కోసం పోరాటం చేయాలని ఎపి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కోర్ల నారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. డిసెంబరు 22న రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముదిరాజ్‌ల హక్కుల కోసం ఎపి ముదిరాజ్ మహాసభ చేపట్టిన ప్రచార చైతన్యం కార్యక్రమం ఆదివారం విజయవాడలో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కోర్ల నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు వర్ల నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి రాజులు మాట్లాడారు. రాష్ట్రంలోని ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనుకబడి వున్నారన్నారు. రాష్ట్రంలో వున్న 20 లక్షల మంది ముదిరాజ్‌లను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బిసి డి నుండి బిసి ఎ కు మార్చాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు డి శివాజి, శివాజి గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు

● కసరత్తును ప్రారంభించిన ప్రభుత్వం
● 8 కల్లా సీనియార్టీ జాబితా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-2 విఆర్‌ఒల ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నలిచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. మార్గదర్శకాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఇటీవల జిఓ ఎంఎస్ నెంబరు 166ను విడుదల చేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,400 మంది గ్రేడ్-2 విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు లభిస్తాయి. ఫలితంగా గ్రేడ్-2 విఆర్‌ఒలు గ్రేడ్-1 విఆర్‌ఒలు కానున్నారు. వీరందరికీ జూనియర్ అసిస్టెంట్ బేసిక్ కూడా అమలు కానుంది. గ్రేడ్-2 కింద పనిచేస్తూ రెండేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి లబ్ధి చేకూరనుంది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీ సీనియారిటీ జాబితా తయారీలో మండల స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు. కొన్ని జిల్లాల్లో విఆర్‌ఎ నుంచి విఆర్‌ఒగా ప్రమోషన్ కల్పించారు. సీనియారిటీ జాబితా సిద్ధం చేసే విషయంపై ఆయా జిల్లాల కలెక్టర్లు మండల తహశీల్దార్లకు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 8లోగా అర్హుల జాబితాను తయారు చేయడంతోపాటు ఎన్ని ఖాళీలున్నాయి? అర్హులు ఎంత మంది ఉన్నారనే విషయం క్షేత్రస్థాయి అధికారులు నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అర్హుల జాబితా ప్రొఫార్మాలో మండలం పేరు, సెక్రటేరియట్ కోడ్, సెక్రటేరియట్ పేరు, విఆర్‌ఒ పేరు, హెచ్‌ఆర్‌ఎంఎస్ ఐడి, సిఎఫ్‌ఎంఎస్ ఐడి, గ్రేడ్-1 లేక గ్రేడ్-2, అనే వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటితోపాటు ఉద్యోగికి సంబంధించి మరికొన్ని వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఉద్యోగికి సంబంధించి ఇప్పటి వరకు ఏమైనా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే వాటి వివరాలతో పాటు ఎసిబి కేసులు, సస్పెండ్ కావడం లేక విధులకు గైర్హాజరుకావడం, ఉద్యోగి వికలాంగులైతే అందుకు సంబంధించిన డాక్టర్ సర్టిఫికెట్‌లో వికలాంగత్వం ఎంత పర్సంటేజ్ చూపారు? సీనియారిటీ జాబితాలో సీరియర్ నెంబర్ వారీ ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కలెక్టర్లు.. తహశీల్దార్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ సంస్థల్లో ఖాళీ పోస్టుల భర్తీ

● 3 వేల జెఎల్‌ఎం, 500 ఎఇఇ పోస్టులు?
● కొత్త సర్వీస్ రూల్స్ ప్రకారం నోటిఫికేషన్లు
● ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. అయితే ఉన్న ఖాళీలు మొత్తం కాకుండా, వాటిల్లో సగం మాత్రమే భర్తీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. ఉన్న సర్వీస్ రూల్స్ ప్రకారం కాకుండా కొత్త సర్వీస్ రూల్స్ ప్రకారం వీటి భర్తీకి అనుమతి ఇవ్వాలని కోరాయి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) పోస్టులు డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలలో కలిపి 1,200 ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. డిస్కంలలో 380 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి మొత్తాన్ని కాకుండా, ఒక్కో డిస్కం 100 ఎఇఇ పోస్టుల చొప్పున 300 పోస్టుల భర్తీకి అనుమతి కావాలని మూడు డిస్కంలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. వీటితో పాటు సుమారు 3 వేల ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్‌మెన్ (గ్రేడ్-2) పోస్టులనూ భర్తీ చేయాలని ప్రభుత్వానికి డిస్కంలు ప్రతిపాదనలు పంపాయి. ట్రాన్స్‌కోలో 400 ఎఇఇ పోస్టులు ఖాళీగా ఉంటే 200 పోస్టుల భర్తీకి అనుమతి కావాలని ఆ సంస్థ కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జెన్‌కోలో 400 ఎఇఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే జెన్‌కో యాజమాన్యం మాత్రం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం లేదని అంటున్నాయి. ఖాళీలున్నా లేవనే ప్రభుత్వానికి ఇటీవల పంపినట్లు సమాచారం. ఈ ఏడాది కృష్ణపట్నంలోని థర్మల్ ప్లాంట్‌లో 800 యూనిట్, విజయవాడలోని థర్మల్ ప్లాంట్‌లో 800 యూనిట్ ప్రారంభమయ్యాయి. కొత్త యూనిట్లకు సిబ్బందిని మంజూరు చేయలేదు. పైగా ఉన్న ఖాళీలను లేవని యాజమాన్యం చెప్పడం సరికాదని విద్యుత్ ఇంజినీర్ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ పోస్టుల భర్తీని, ఇటీవల తెరపైకి తీసుకొచ్చిన నూతన సర్వీస్ రూల్స్-2021 ప్రకారం భర్తీ చేయాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో ఉంది. ప్రస్తుతం ఉన్న పోస్టుల పేరు మార్చి కొత్త పేరును విద్యుత్ సంస్థలు ప్రతిపాదించాయి. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే నిబంధనలు అమలు చేయాలని సూచించాయి. కొత్త సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ కొత్త సర్వీస్ రూల్స్‌ను విద్యుత్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. కొత్త రూల్స్ ఉన్న ఉద్యోగులకు, కొత్త ఉద్యోగుల మధ్య విభజన తెచ్చే విధంగా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పద్ధతిలోనే నియామకాలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్త సర్వీస్ రూల్స్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపి భర్తీ చేస్తుందా? పక్కన పెట్టేస్తుందా? వేచి చూడాల్సిందే.



విజయవాడలో సమ్మె శిబిరంలో డ్యాన్స్ చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రం పిల్లలు



శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురంలో దీక్షా శిబిరం వద్ద కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీలు

'పోరాడుదాం... ఆంధ్ర'

మొదటిపేజీ తరువాయి

216వ నెంబరు జాతీయ రహదారిపై క్రికెట్ ఆడారు. గుంటూరు జిల్లా కొల్లిపరలో ఖోఖో, 'వీరివీరి గుమ్మడి పండు... వీరి పేరేమి' లాంటి ఆటలు ఆడి నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరం, విజయనగరం, జామి, బాడంగి, ఎస్.కోట తదితర మండలాల్లో కబడ్డీ, ఖోఖో ఆడారు. పార్వతీపురం, పాలకొండ, సీతానగరం, బలిజిపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, కొమరాడ, గరుగుబిల్లి తదితర మండలాల్లో అంగన్‌వాడీ శిబిరాల్లో అంగన్‌వాడీలు ఆట పాటలతో నిరసన తెలిపారు. సాలూరులోని అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్దకు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వచ్చి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం, ఎచ్చెర్ల, కోటబొమ్మాళిలో అంగన్‌వాడీలు ఆట, పాట కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయిల్లో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. నెల్లూరు జిల్లా మైపాడులో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.

5వ తేదీలోపు విధుల్లో చేరకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : మంత్రి బొత్స బెదిరింపులు

అంగన్‌వాడీలు జనవరి 5వ తేదీలోపు విధుల్లో చేరకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మె గురించి విలేకరులు ప్రశ్నించగా, ఆయన పైవిధంగా స్పందించారు. గత ప్రభుత్వం కొంత పెంచగా, తాము మరికొంత పెంచామని చెప్పారు.


జాయింట్ ఎల్‌పిఎమ్‌లతో చిక్కులు

మొదటిపేజీ తరువాయి

వారి చేతుల్లో ఉన్నాయని, సర్వే సమయంలో ఉమ్మడి సర్వే నెంబర్లకు సంబంధించిన భూ యజమానులు అందుబాటులో లేకపోయినా.. ప్రక్రియ ఆగిపోయే ప్రమాదముందని పేర్కొంటున్నారు. రీ సర్వేలో తమతోపాటు విఆర్‌ఒలు, మండల సర్వేయర్లు, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కూడా ఉందని, తప్పుల దగ్గరకు వచ్చేసరికి తమను మాత్రమే దోషులుగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామ సర్వేయర్లు వాపోతున్నారు.

ఏడాదిలోగా ఉచితంగా ఆర్‌ఒఆర్ సవరణలు

భూముల రీ సర్వేకు సంబంధించి ఆర్‌ఒఆర్‌లో జరిగిన తప్పులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం ఏడాది సమయం ఇచ్చింది. తమకు అన్యాయం జరిగిందని భావించే భూ యజమానులు ప్రభుత్వం ఇచ్చిన గడువులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. అప్పీల్ సమయంలో ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా రికార్డులను సరిచేస్తారు.



'జూలూరు పథం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణ, తదితరులు

సమాజం నుంచి స్ఫూర్తి పొందిన కవిత్వమే రాణిస్తుంది

● కవి జూలూరు గౌరీశంకర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

సమాజం నుంచి స్ఫూర్తి పొందిన కవిత్వమే సమాజాన్ని కదల్చగలుగుతుందని పాత్రికేయులు, కవి జూలూరు గౌరీశంకర్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 34వ పుస్తక మహోత్సవం కనుల పండుగగా సాగుతోంది. నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్యవేదికపై 'జూలూరు పథం' పేరుతో పాత్రికేయులు జూలూరు గౌరీశంకర్ రాసిన దీర్ఘకవిత పుస్తకాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత్వంపై సాహిత్యం, సమాజం ప్రభావం గురించి నారాయణ, గౌరీశంకర్ ముఖాముఖీ చర్చ నిర్వహించారు. సమాజంలో చైతన్యాన్నే కవులు అందంగా ప్రభావవంతంగా ప్రతిఫలించి మరో పది మందికి చేరుస్తారని గౌరీశంకర్ వివరించారు. కవులు, సాహిత్యకారులు సమాజంలో మార్పుకు స్ఫూర్తినిస్తూ, సమాజ పరిణామంలో వివిధ దశలకు దోహదం చేస్తారని చెప్పారు. కళ కళ కోసం మాత్రమే ఉంటే అది ప్రజల మెప్పు పొందలేదని వివరించారు. ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషికేషన్స్ మేనేజరు మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

కొలువుతీరిన లక్షలాది పుస్తకాలు

విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన 34వ పుస్తక మహోత్సవ్‌లో లక్షాలాది పుస్తకాలు కొలువుదీరాయి. పుస్తకాల పండుగలో నగర వాసులు పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం సెలువు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పుస్తక మహోత్సవ్ కళకళలాడింది. సాహితీ ప్రియులు, పుస్తక ప్రియుల ఆనందానికి అవధులు లేవు. పుస్తక మహోత్సవ్‌లో 200కుపైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రముఖ స్టాల్స్ నిర్వాహకులు లక్షలాది పుస్తకాలను ఏర్పాటు చేయడంతో ఎవరికి వారు తమకు కావాల్సిన పుస్తకానలు కొనుగోలు చేస్తున్నారు.

నేడు పిఎస్ఎల్‌వి-సి 58 ప్రయోగం

- కౌంట్ డౌన్ ప్రారంభం



ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న పిఎస్ఎల్‌వి-సి58 రాకెట్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో కీలక రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. పిఎస్ఎల్‌వి-సి 58 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన 25 గంటల కౌంట్ డౌన్ ఆదివారం ఉదయం 8.10 గంటలకు ప్రారంభించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుండి సోమవారం ఉదయం 9.10 గంటలకు ఈ రాకెట్ ద్వారా ఎక్స్ పో శాట్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. 480 కిలోల బరువు కలిగిన ఎక్స్ పో శాట్‌తోపాటు ఒక కిలో బరువు కలిగిన కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన విఐవై అనే నానో ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు ఇస్రో సిద్ధం చేసింది. భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్ష కక్ష్యలో తిరిగే ఎక్స్ పో శాట్ ఐదేళ్ల పాటు పనిచేయనుంది. ప్రధానంగా ఎక్స్ కిరణాలపై అధ్యయనం కోసం ఈ ప్రయోగం జరుపుతున్నారు. టెలిస్కోప్ లాగా ఈ ఉపగ్రహం అంతరిక్ష రహస్యాలను ఛేదించబోతుందని, భవిష్యత్తు ప్రయోగాలకు కీలకంగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభం మొదటి రోజున రాకెట్ ప్రయోగం జరపడం పట్ల అందరి దృష్టి దీనిపై పడింది.



నెల్లూరులో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన దీక్ష


విజయవాడలో నిరసన

కొనసాగుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ఉపాధ్యాయ, ప్రజా సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి-యంత్రాంగం
తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె కొనసాగింది. ఆదివారంనాటికి 12వ రోజుకు చేరుకుంది. హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారికి ఉపాధ్యాయులు, కార్మిక, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.

సమగ్ర శిక్ష కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న ఈ సమ్మెల్లో పలువురు మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి రాష్ట్ర నాయకులును చర్చలకు పిలిచి న్యాయమైన సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. శనివారం జరిగిన చర్చల్లో ఎటువంటి పురోగతీ లేదని, చర్చలు విఫలం కావడానికి ప్రభుత్వమే కారణమని అన్నారు.

తిరుపతిలోని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహం వద్ద ఆయనను ఉద్యోగులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించాయి. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సమ్మెకు ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, జవహర్‌రాజు సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులతో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలుచొని, ముక్కు, చెవులు, నోరు మూసుకొని నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సమ్మె శిబిరంలో అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. నెల్లూరు జిల్లా సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ఎపిటిఎఫ్ నాయకులు రూ. పదివేలు, యుటిఎఫ్ నాయకులు 10,500 ఆర్థిక సాయం చేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లా, బాపట్ల, నెల్లూరు, ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా కాకినాడలో, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో, విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లా, విజయనగరం జిల్లా సమ్మె కొనసాగింది.

సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు

- ఎపి రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య డిమాండ్



ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్
రాష్ట్ర వ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, రజక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల నివారణకు సామాజిక రక్షణ చట్టం వెంటనే చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఎల్‌బిజి భవన్‌లో సంఘం ప్రాంతీయ సదస్సు టంగుటూరి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినా సామాజిక సేవ వృత్తి చేస్తోన్న రజకులపై పెత్తందారులు, పెత్తందారీ ప్రజాప్రతినిధుల అనుచరులు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. రజకులపై అక్రమంగా కేసులు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రజక మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రజకుల సమస్యలను గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర మంత్రులు, బిసి అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు, బిసి అభివృద్ధి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దష్టికి తమ సంఘం తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రజకుల సమస్యల పరిష్కారం, సామాజిక రక్షణ చట్టం సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రజకులతో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 29న గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో శ్రీ సాయిరాం జూనియర్ కాలేజీ, సాయి వికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహన్‌రావు, చేతివృత్తుదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ బాటలో ఆర్‌టిసి ఉద్యోగులు

విలీనం తర్వాత పెరిగిన కష్టాలు



నెల్లూరులో ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆర్‌టిసి ఉద్యోగులు ఉద్యమ బాటకు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో ఆర్‌టిసిలో వున్న ఉద్యోగులను సాంకేతికంగా ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చడం తప్ప కొత్తగా ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గతంలో వున్న అలవెన్సులు, ప్రోత్సాహకాలు, మెరుగైన హెచ్‌ఆర్ పాలసీ, వైద్య సౌకర్యం వంటి వాటికి కోత పడటంతో ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో వున్నపుడు ఉద్యోగికి ఏదైనా సమస్య వచ్చినపుడు, క్రమశిక్షణ చర్యలకు గురైనప్పుడు నేరుగా యజమాన్యంతో చెప్పుకుని పరిష్కరించుకునే వెసులుబాటు వుండేది. ఇపుడు ఆర్‌టిసి ఎమ్‌డికి వినతి ఇచ్చినా ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పడం తప్ప పరిష్కారానికి చొరవ తీసుకునే వ్యవస్థ లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విలీనం కాగానే ఆర్‌టిసి ఉద్యోగులందరికీ పాతపెన్షన్ విధానం అమలవుతుందని ఆశించారు. ఒపిఎస్ ఇవ్వలేమని సిపిఎస్ గానీ జిపిఎస్‌ను గానీ తీసుకోవాలని యాజమాన్యం చెబుతోంది. సిపిఎస్, జిపిఎస్ కంటే ఇపిఎఫ్ ద్వారా వచ్చే పెన్షన్ మేలని ఉద్యోగులు ఎక్కువ మంది అటువైపు మొగ్గుచూపుతున్నారు. అలాగే సరెండర్ లీవులకు సంబంధించి 2017 నుంచి 2020 వరకు వున్న బకాయిలను ఎత్తేసిన ప్రభుత్వం ఆ తర్వాత కూడా దాదాపు రూ.350 కోట్లు పెండింగ్ పెట్టేసింది. అన్ని ప్రభుత్వ శాఖల తరహాలో ఉద్యోగోన్నతులు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. 8వ తరగతి అర్హతతో డ్రైవర్, 10వ తరగతి అర్హతతో కండక్టర్లు ఆర్‌టిసిలో ఎక్కువగా వున్నారు. ఎడిసి, ట్రాఫిక్‌లలో ఇచ్చే ఉద్యోగోన్నతుల్లో ఇప్పటి వరకు సగటున 25 ఏళ్లుదాటిన డ్రైవర్లు, కండక్టర్లకు ఉద్యోగోన్నతులు లభించేవి. ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఎడిసి పోస్ట్ జూనియర్ అసిస్టెంట్ పోస్టుతో సమానమని, డిగ్రీ వుంటేనే ఉద్యోగోన్నతి అంటూ ఆర్‌టిసి యజమాన్యం చెప్పడంతో ఆర్‌టిసిలోని అన్ని ఉద్యోగ సంఘాలు ఉద్యమబాట పట్టాయి. విద్యార్హతతో ప్రమేయం లేకుండా పాతపద్ధతిలో ఉద్యోగోన్నతుల అవకాశం కల్పించాలనే వారి డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో పాత నిబంధనలతోనే ఉద్యోగోన్నతులు కల్పించేలా ఉత్తర్వులిచ్చింది. అయితే క్రమశిక్షణ చర్యలకు గురైన వారికి ఉద్యోగోన్నతి లేదనే నిబంధన పెట్టడంతో మెజారిటీ డ్రైవర్లు, కండక్టర్లు ఉద్యోగోన్నతులకు నోచుకోవడం లేదు. అలాగే అలవెన్సుల అంశంలో ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. కార్పొరేషన్‌లో వున్నపుడు ఆర్‌టిసి సొంత ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందేవి.

అక్కడ అందుబాటులో లేని చికిత్సలను ప్రైవేటు ఆస్పత్రుల్లో పొందేవారు. ఇపుడు ప్రభుత్వం హెల్త్‌కార్డుల ద్వారా సేవలు అందిస్తామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం చాలా ఆస్పత్రుల్లో ప్రభుత్వ హెల్త్‌కార్డులకు వైద్యం అందడం లేదు. అలాగే ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క బస్సునూ కొనుగోలు చేయకుండా హైర్ బస్సులను ప్రవేశపెట్టడం, అవసరమైతే బస్సు సర్వీసులను ప్రభుత్వం రద్దు చేస్తుండటంతో ఆర్‌టిసి మనుగడపైనా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎన్ఎంయు ఆందోళనలు చేయడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణ చేపట్టాయి.



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న పుట్టంరాజు తదితరులు

రాజమండ్రిలో 5, 6, 7 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు మహాసభ

- ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి (బాపట్ల జిల్లా)
రాజమండ్రిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభ కరపత్రాలను అద్దంకిలోని రోటరీ సంస్థ కార్యాలయంలో సాహితీ మిత్రమండలి గౌరవాధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అనే నినాదంతో తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా డాక్టర్ కేశిరాజు శ్రీనివాస్, తెలుగు భాషాభిమాని చైతన్యరాజు నిర్వహణలో రాజమహేంద్రవరంలో తెలుగు మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాషలోని 25 ప్రక్రియలపై సదస్సులు, గ్రంథావిష్క రణలు, కళా ప్రదర్శనలు జరగనున్నాయన్నారు. తెలుగు భాషా వైభవాన్ని చాటే తెలుగు మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సాహితీ మిత్రమండలి, అద్దంకి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కె.వి.పోలిరెడ్డి, లక్కరాజు శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ లైన్లో ఆగిన యశ్వంత్‌పూర్-కారటగి ఎక్స్‌ప్రెస్ రైలు

ఇబ్బందిపడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి-రాయదుర్గం
యశ్వంతపూర్ నుంచి అనంతపురం జిల్లా రాయదుర్గం మీదుగా కారటగి మధ్య ప్రతిరోజూ తిరిగే ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం వేకువజామున 4:40 గంటలకు రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో 1వ నెంబర్ ప్లాట్‌ఫారం చేరుకోవాల్సి ఉండగా మధ్యలో ఉన్న మెయిన్ లైన్ మీద ఆగిపోయింది. 1, 2 ప్లాట్ ఫారాలపై అప్పటికే గూడ్స్ రైళ్లు ఆగి ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మెయిన్ లైన్‌లో ఆపినట్లు స్టేషన్ మాస్టర్ ధర్మతేజ తెలిపారు. దీంతో ఎటువైపు దిగాలో తెలియక ప్రయాణికులు కాసేపు తికమక పడి అటువైపు కొందరు, ఇటువైపు కొందరు దిగి, గూడ్స్ రైళ్ల మధ్య సందుల్లో నడుచుకుంటూ వెళ్లారు. మహిళలు చిన్న పిల్లలను, లగేజీని అతికష్టం మీద మోసుకుంటూ వచ్చారు. దీనిపై స్టేషన్ మాస్టర్ వివరణ ఇస్తూ పుట్టపర్తి రైలు మార్గంలో సొరంగం నిర్మాణం పనులు జరుగుతున్న దృష్ట్యా ఆ మార్గం మీద ప్రయాణించే గూడ్స్ రైళ్లు కూడా రాయదుర్గం-బళ్లారి- చిక్కజాజూరు మార్గం మీదుగా మళ్లించడంతో సగటున రోజుకు 30 వరకూ గూడ్స్ రైళ్లు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఇంజన్ మొరాయించడంతో ఓబుళాపురం స్టేషన్ ఫ్లాట్‌ఫారంపై గూడ్స్ రైలు ఆగిపోయిందన్నారు. కారటిగి-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు రాయదుర్గం స్టేషన్‌కు వచ్చేసరికి రెండు ప్లాట్‌ఫారాలలో రెండు గూడ్స్ రైళ్లు ఆగి ఉండడంతో రైలును సకాలంలో గమ్యస్థానం చేర్చాలనే ఉద్దేశంతో స్టేషన్ మధ్యలో ఉన్న మెయిన్ లైన్‌లో ఆపినట్లు తెలిపారు.

అమృత్ భారత్ రైలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆమదాలవలస
పశ్చిమ బెంగాల్‌లో మాల్దా టౌన్ నుంచి బెంగుళూరు మధ్య నడిచే అమృత్ భారత్ రైలును శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలో నిలిచే ఈ రైలులో 12 స్లీపర్ క్లాసులు, ఎనిమిది జనరల్ బోగీలు ఉంటాయన్నారు. ఎసి కోచ్‌లు ఉండవని తెలిపారు. రూ.25 కోట్లతో అమృత్ భారత్ స్టేషన్ నిర్మాణం తొందరలోనే జరుగనుందని, దీంతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజానీకానికి ఉపయోగపడేలా మరిన్ని రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎం ఎ.కెగుప్తా, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాపా, రైల్వే బుకింగ్ సూపర్‌వైజర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి పవన్ రాసిన లేఖపై చర్చకు రావాలి

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో పేదల ఇళ్ల స్థలాల సేకరణ, నిర్మాణాల్లో అవినీతి జరిగినట్లు ప్రధాని నరేంద్ర మోడీకి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అవాస్తవాలతో లేఖ రాశారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. పవన్‌కల్యాణ్‌కు చిత్తశుద్ధి వుంటే ఆ లేఖపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వని రీతిలో పేదలకు 30.65 లక్షల ఇళ్ల స్థలాలను ఇచ్చామన్నారు. 21.75 లక్షల మందికి గృహ నిర్మాణ పనులను కూడా చేపట్టామని తెలిపారు. ఇప్పటికే లక్షల మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకున్నారని అన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం మేనిఫెస్టోను అమలు చేయకపోయినా ఏనాడూ ప్రశ్నించని పవన్‌కల్యాణ్.. అన్నీ అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా వుండి సొంత నియోజకవర్గానికి సాగు, తాగునీరు ఇవ్వలేని చంద్రబాబు కుప్పంలో పండే పంటలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు.

సౌత్ జోన్ టెన్నిస్ టోర్నీ ఛాంపియన్ ఎస్ఆర్ఎమ్ వర్సిటీ

- రన్నరప్‌గా ఆంధ్ర వర్శిటీ



ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ)
కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర లయోల కళాశాలలోని టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న దక్షిణ మండల అంతర విశ్వ విద్యాలయాల టెన్నిస్ పురుషుల ఛాంపియన్‌గా ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర విశ్వ విద్యాలయంపై 3-0 తేడాతో విజయం సాధించి ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. రన్నరప్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలవగా మూడు, నాలుగు స్థానాల్లో భారతీయార్ విశ్వవిద్యాలయం, కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం జట్లు నిలిచాయి. నాలుగు జట్లు అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల టెన్నిస్ పురుషుల టోర్నీకి అర్హత సాధించాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కృష్ణా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్ ఇండియా స్థాయిలో మంచి ప్రతిభ చూపి విశ్వవిద్యాలయాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీర బ్రహ్మాచారి, కష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నవీన్ లావణ్య లత, ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపల్ జి.ఎ.పి.కిషోర్, టోర్నీ కన్వీనర్ డాక్టర్ జె.వి.నాగేంద్రప్రసాద్, వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి, అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ప్రజామద్దతు మాకే ఉంది : మంత్రి అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా సిఎం జగన్‌ను ఓడించలేరని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులోని ఎన్‌జిఒ కల్యాణ మండపంలో ఆదివారం వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ప్రజలు జగన్‌ను సిఎంగా కొనసాగించడానికి నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ప్రజామద్దతుతో ఘన విజయం ఖాయమని అన్నారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ న్యాయవాదులకు సిఎం జగన్ పూర్తిస్థాయిలో గుర్తింపు ఇచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం విజయం తథ్యం అన్నారు. ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, గుంటూరు జిల్లా వైసిపి అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొన్నారు.

4న పాస్ పుస్తకాల ప్రతులు దగ్ధం : సిపిఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : భూముల రీ సర్వే సందర్భంగా అవకతవకలతో తయారుచేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను జనవరి 4న గ్రామ సచివాలయాల వద్ద దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడ దాసరి భవన్‌లో ఎన్ రంగనాయుడు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలను సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ వివరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కర్తవ్యాలను వివరించారు. జగనన్న భూరక్ష కింద పంపిణీ చేస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలను ముద్రించి రైతులకు అందజేస్తున్నారని, రైతులకు అందజేసిన పాస్ పుస్తకాలు భూమి రిజిస్ట్రేషన్‌కు, తనఖా పెట్టుకోవడానికి, రుణాలు పొందడానికి ఏమాత్రం ఉపయోగం లేదని తీర్మానం చేశారు. 3న అంగన్‌వాడీ కార్యకర్తల కలెక్టరేట్ల ముట్టడికి సిపిఐ మద్దతునివ్వాలని, అమరావతి రాజధాని రైతులకు జనవరి 5లోపు కౌలు చెల్లించాలని, 14, 15 ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని తీర్మానం చేశారు. బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్షా అభియాన్, విఆర్ఒ, విఆర్ఎ, వలంటీర్ల ఆందోళనలకు మద్దతు ఇవ్వాలని తీర్మానించింది. సమావేశంలో సిపిఐ నాయకులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.


అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ | సోమవారం 1 జనవరి 2024



"సమాజాన్ని అప్రతిష్ట పాలు చేసే పరిస్థితిని కళ్ల ముందర పెట్టి, నైతిక భావాల్ని, ఉన్నత ప్రమాణాల్ని ప్రాచుర్యంలోకి తేవడం కంటే- సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేమీ లేదు."

- గురజాడ



'శుభ' ఆకాంక్షలు

ఈ నూతన వత్సరానికి
అక్షరాలను పేర్చితేనో
లక్షణాలను కూర్చితేనో
చేతికి బంధనాలు దాల్చితేనో
కొత్తదనం వస్తుందనీ
కొత్త వెలుగు ఉదయిస్తుందనీ
నేనమ్మను కాక నమ్మను

కొత్త సీసాలో పాత సారాను
పోసేసుకునీ
సంబరాలను అంబరంగా
జరిపేసుకునీ
క్యాలెండర్లో తారీఖును
చింపేసుకునీ
మొఖానికి నవ్వుల్ని
పూసేసుకునీ
అదే నూతనత్వం అంటే
నేనమ్మను కాక నమ్మను

జారిపోతున్న కాలాన్నీ
కూలిపోతున్న దూలాన్నీ
వెతుకుతున్న కళ్లనూ..
ఆలోచిస్తున్న మెదళ్లనూ..
ఎవరాపగలరు చెప్పండి..!

కాలం మిగిల్చిన గాయాల్ని
వేలం గెల్చిన మానాల్ని
కరోనాలు కూల్చిన ప్రాణాల్ని
ఏ దు్ఖపు త్రాసులో
కొలుసుకోవాలో చెప్పండి..!

వెలవెల బోతున్న బతుకును
తెరమరుగవుతున్న మెతుకులను
చిరుగులకు వేస్తున్న అతుకులను
మాటల మనసు చితుకులనూ
ఎవరో ఒకరు ఆపాలి..!
ఏ కొత్తదనమో ఆవహించాలి

కల్మషాలను కడిగేసుకొని
కళ్లల్లో కాంతులు పోగేసుకుని
గతాన్ని నెమరేసుకొని
బాధల్లో తడుస్తున్న
వర్తమానాన్ని మానాన్ని
ఓ కొత్త వలువతో చుట్టుకోవాలి
భవిష్యత్తును అందంగా
ముస్తాబు చేసుకోవాలి...

సమతను పెంచి మమతను పంచి
ఈ నూతన వత్సరాన
కొత్తగా.. కొంగ్రొత్తగా..
అభ్యుదయ భావాల చిగుళ్ళు
తొడుక్కోవాలి
ఉషస్సులా.. తపస్సులా..
నూతనత్వం వెల్లివిరియాలి..!

– డా.కటుకోఝ్వల రమేష్,
99490 83327



అప్డేట్

ఆచరణ లేని స్టేటసులు
అది చూసి అయోమయంలో అమాయకులు
మస్తిష్కంలో యురేకా తడబడినట్టుగా
సెల్ఫీ కుడి ఎడమై కనిపిస్తున్నా
అదే నమ్మే ఫాలోవర్

అనుకరణల ఆలోచనలు ఒకవైపు
మూలం తెలియక వథా అయ్యే కామన్ మెన్ టైం
ముఖ పుస్తకంలో నిత్యం సూక్తుల చక్కర్లు
అనాథాశ్రయాల్లో సీనియర్ సిటిజన్లు
మది దోచే ఆర్టిఫిషియల్ అందాలు
కన్ఫ్యూజన్లో అదే నిజమనుకొని యూత్ పడిపోయే

కొత్త అంటూ అసలువన్నీ పక్కకు
అనవసర చెత్తను తెచ్చుకునే కాన్ఫిడెన్స్‌తో

దొంగ నవ్వులు నమ్మబలికే కస్టమర్లకు
టార్గెట్ నింపడానికి తన్లాటతో
నయా దుకాణాల సేల్స్‌మెన్ కాల్స్

లోకల్ అయిపోయే రోజు అబ్రాడ్ ఫోన్ కాల్స్
లైవ్ చాటింగ్, కాలింగ్‌తో అనవసర పనులు తెప్పలుగా
బంధాలు,అనుబంధాలు ఎక్కెను అటక్కు
రియాలిటీ లేని 'రిలేషన్ షిప్పులు'
మరెన్నో కావాలి అప్డేట్

కోటి కాంతులతో ఈ కొత్త సంవత్సరం
సరికొత్తగా ఇంద్రధనస్సులా ...


–డా. చిటికెన కిరణ్ కుమార్
94908 41284

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

మియాల వలస దుఃఖాన్ని వినిపించిన స్వరం

సందర్భం





ముకుంద రామారావు అనగానే 'అదే నేల', 'అదే ఆకాశం', 'అదే నీరు', 'అదే కాంతి' పుస్తకాలు గుర్తుకు వస్తాయి. ఈ అనువాద కవిత్వమే కాకుండా 'వలసపోయిన మందహాసం', 'రాత్రి నదిలో ఒంటరిగా' మొదలైన స్వీయ కవితా సంపుటాలను కూడా ఆయన ప్రచురించారు. ఆయన అనువాదం చేసిన మియా కవిత్వం అస్సాంలో ఆటుపోట్లకు గురవుతున్న మియాల బాధాతప్త స్వరాన్ని వినిపిస్తుంది.

ప్రపంచంలో అన్నిటికన్నా విషాదమేమిటంటే – తాను నిలబడిన నేల తనది కాదని ఇంకెవరో చెబుతూ వేధించటం. కన్నతల్లిని, ఉన్న ఊరిని ఎవరైనా ప్రేమిస్తారు. కానీ ఉన్న ఊరే "ఊరు నీది కాదు. నీకు ఇక్కడ స్థానం లేద"ని తిరస్కరించినప్పటి బాధ భరించలేనిది. ఈ దు్ఖం గురించి రాసిన కావ్యమే 'మియా కవిత్వం'. ఇది అసోమియా ముస్లిం అస్తిత్వ స్వరం. అస్సాంలోని నదీతీర ప్రాంతంలో నివసించే 70–75 లక్షల మంది ముస్లిం ప్రజల సమాజం మియా.

అసలు అస్సాం అనేదే వలస దారుల రాష్ట్రం. బెంగాల్ నుంచి అస్సాంకు మియాల వలస 19వ శతాబ్దం ఏడవ దశాబ్దం చివరి భాగంలో మొదలైంది. వారు అస్సామీని తమ మాతృభాషగా అంగీకరించారు. తమను తాము అస్సామీలుగా చెప్పుకుంటారు. కానీ, ఈ సమాజం స్వాతంత్ర్యం వచ్చాక కూడా నిర్లక్ష్యానికి గురైంది. అక్కడ ఎన్నో మతపరమైన అల్లర్లు జరిగాయి. అయినా ఈ సమాజంలోని ప్రజలను చంపినందుకు, హింసించినందుకు ఏ ప్రభుత్వమూ ఎవరినీ శిక్షించ లేదు. కానీ, పౌరసత్వం పేరుతో ఇప్పుడు వారిని వేధిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27, 2016లో 'రైట్ డౌన్ ఐ యాం ఏ మియా" అనే కవిత సోషల్ మీడియాలో వచ్చింది. దానికి ప్రతిస్పందనగా 15 రోజుల్లోనే 200లకు పైగా కవితలు వెలువడ్డాయి. అస్సాంలోని ఆధిపత్య శక్తులు 10 మంది మియా కవులపై అస్సామీ వ్యతిరేకులుగా ముద్ర వేస్తూ 8 కేసులు పెట్టారు. అయినా సరే, ప్రతిరోజూ కవులు కొత్త కవితలు వెలువడుతూనే ఉన్నాయి. ఈ మియా కవిత్వం ముద్రణ రూపంలో కంటే, ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లోనే విశేష ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత రెండవ దశలో యూట్యూబ్‌ని వాడుకున్నారు.

మియా కవిత్వంలోకి వెళితే ... మౌలానా బందె 84 పుస్తకాలు రాశాడు. తాను రాసిన 'ఒక చారువా ప్రతిపాదన' కవితలో 'మియా' అనే పదం వాడకపోయినా, వారి ఉనికిని చెప్పే మొదటి కవితగా మియా కవులు దీనిని భావిస్తారు. "నా జన్మస్థలం బెంగాల్ అంటారు కొందరు/ నేను చారు వా (ఇసుకమేట వాసిని) కాను, వలస వాసినీ కాను / మేము కూడా అస్సాం నేలా గాలి భాషలతో/ అసోమియాలు అయ్యాము/ అస్సాం తల్లి తన రొమ్ముతో మమ్మల్ని పోషిస్తుంది/ ఆమె ఉల్లాసమైన బిడ్డలం మేం" అని, తాము ఈ రాష్ట్రానికి పరాయి వాళ్ళం కాదు, అస్సాం వాసులమే అని చెప్తాడు.

కబీర్ అహ్మద్ తన 'వినమ్రంగా నివేదించుకుంటున్నాను ఇది (1985)'లో నేను అస్సామీని అని చెప్తూ "అప్పటినుండి నేల మీద రాళ్ల పరిచాను, నా శరీరాన్ని కుళ్ళిన మొక్కతో నల్లగా మాడ్చుకున్నాను / రక్తం చెమటతో పంటలు పండించాను / నా తండ్రుల నాగలితో 'అస్సాం' అనే భూమిని దున్నాను" అని తన మాతభూమి అస్సాం అని చెప్తున్నాడు. అయినా 1983లో నెల్లీలో అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఎందరో మియాల ఇళ్లు కాలిపోయాయి. "1983 మంటల రాత్రి / నెల్లీ నల్లటి పొయ్యి మీద నిల్చుని నా దేశం అరిచింది / సయ డాకా పాఖీ డాకా – మియాల ఇళ్ళు శ్మశానాల్లా కాలాయి/ సంగతి ఏదైనా నా పేరు / ఇస్మాయిల్ షేక్, రంజాన్ ఆలీ లేదా మజీద్ మియా / విషయం – నేను అస్సామీ అసోమియాని' అని తాను అస్సామీ అని ప్రకటించుకున్నాడు.

మియా ఉద్యమ కవి డా.హాఫీజ్ అహ్మద్ 'నిట్టూర్పు (2016)'లో 'బ్రహ్మపుత్రా నది కోతకు అంతా కోల్పోయాక/ మాకు లేనిది ఏమిటి?/ పచ్చని వరి పొలాలు / చేపల వర్తకంలో చేప గెంతుళ్ళు/ పిల్లల హాసోల్లాసాలలో పెరిగిన ఇంటి ఆవరణలు/ నిండుగా జనం, ఉత్సాహం, సంబరాలు/ ఈరోజు ఏముంది?/ మా మెడ మీద బానిసత్వపు గొలుసు/ జయించడానికి సమస్త ప్రపంచమూనా" అని ఒకప్పుడు సకల వైభవాల మధ్య పెరిగిన కవి మెడపై ఇప్పుడు బానిసత్వం గొలుసు వేలాడుతుంది అని బాధపడతాడు. ఈ కవిదే మరో కవిత 'రాసుకో – నేను మియానని రాసుకో '2016)'. "అర్హులైన జాతీయ పౌరుల జాబితా (చీక్ష్మజ)లో నా సంఖ్య 200543/ నాకు ఇద్దరు పిల్లలు/ వచ్చే వేసవిలో/ ఇంకొకడు చేరబోతున్నాడు/ నన్ను అసహ్యించుకుంటున్నట్టే/ వాడిని అసహ్యించుకుంటావా?' అని వాస్తవ జీవితంలో మియాని తక్కువగా చూడడాన్ని ప్రశ్నించాడు. "నేను మియానని రాసుకో/ మీ సుఖం కోసం మీ మురుగును శుభ్రం చేస్తాను/ అయినా మీకు సంతప్తి లేదు/ ప్రజాస్వామిక లౌకిక గణతంత్ర రాజ్యంలో/ ఏ హక్కులు లేని పౌరుడిని/ నా తల్లి ఒక సందేహాస్పద ఓటరు/ ఆమె తల్లిదండ్రులు హిందువులు ఐనా సరే" అని మియాల శ్రమను దోచుకుంటూనే వాళ్లనెలా అణగదొక్కుతున్నారో, వారి హక్కులను ఎలా హరిస్తున్నారో రాశాడు. "కావాలంటే నన్ను చంపెయ్/ ఊరు నుండి తరిమేయ్ / నా పచ్చటి పొలాలు లాక్కో/ నా మీద తొక్కించడానికి/ బుల్‌డోజర్లు అద్దెకి తెచ్చుకో/ నీ బుల్లెట్లు/ నేరమే లేకుండా/ నా ఎదను చెదరగొట్టొచ్చు" అని అక్షరీకరిస్తారు.

అస్సాంలో బ్రహ్మపుత్రా నది చాలా పెద్దది. వర్షాకాలంలో వరదలు వచ్చినపుడు ఇళ్లను ముంచెత్తుతుంది. దీనిపై చాలామంది కవులు స్పందించారు. అబ్దుల్ కలాం ఆజాద్ 'నెల్లీ కాలెండరు మీద ప్రతిరోజూ'లో "నేను ఇక నిద్ర పోలేనన్న/ విచిత్ర కలతో బతుకుతున్నాను/ నా కాలెండరు ప్రతిరోజూ రక్తం మరకలు అయి ఉంటుంది/ దగ్గరలోని ఫరుల్ బాబాయ్ ఆకులా వణికిపోతున్నాడు/ బాబాయికి జ్వరం, రెండు రోజులుగా తిండి లేదు/ కాలెండర్ పరిమాణంలో ఉన్న వెదురు పరుపు మీద అతను కూర్చున్నాడు/ పిన్ని కూడా ఆకులా వణుకుతూనే ఉంది/ నీరు ఇంకాస్త పెరిగితే ఎలా అని" మియాలకు సరైన ఇళ్ళు ఉండవు. నది పొంగిన ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. ప్రాణభయంతో ఆకులా అల్లాడి పోతారు. ఈ కవితలో ఈ దు్ఖాన్ని కరుణ రసాత్మకంగా చిత్రీకరించారు.

ఆ నేల బిడ్డలైనా తమను పరాయి వారిగా చూస్తున్న వారిపై తమ నిరసనను, క్రోధాన్ని కాజీనీల్ బలంగా వ్యక్తీకరిస్తారు. నేల తమదైనా తాము ఆ నేలకు సంబంధించిన వాళ్ళు కాకపోవడానికి పరితపిస్తూ 'ఆ నేల నాది, ఆ నేల వాడిని కాదు నేను' కవితలో "ఆ నేల నా తండ్రిని విదేశీయుణ్ణి చేస్తుంది / నా సోదరుని బుల్లెట్లతో చంపుతుంది/ నా సోదరిని మానభంగం చేస్తుంది/ ఆ నేల, ఎక్కడ నా తల్లి తన హదయంలో కాలుతున్న బొగ్గుల్ని రాజేస్తుందో/ ఆ నేల నాది, ఆ నేల వాడిని కాదు నేను" అంటారు. అక్కడ వారిపై జరిగే హింసను ఎదిరిస్తూ "ఎక్కడయితే నా కొడుకు శవపేటికతో రాజకీయాలు చేస్తారో/ నా కూతురు మానంతో జూదమాడతారో/ ఏ నెలలో వెర్రెక్కి పశువులాగా గజిబిజిగా నేను సంచరిస్తానో/ ఆ నేల నాది, ఆ నేల వాడిని కాదు నేను" అని ఆ అనంత వేదనకు దశ్యరూపమిస్తాడు.

పితస్వామ్య వ్యవస్థలో ఏ రాష్ట్రంలోనైనా ఎక్కడైనా స్త్రీలకు స్వేచ్ఛ లేదు. నిర్బంధాలు, నిషేధాల పంజరాల్లో ఊపిరాడని ఉనికి వారిది. కవితలు రాయడానికి ఇంట్లోవారి అనుమతులు లేకపోయినా కొందరు స్త్రీలు కవితలు రాస్తున్నారు. కవయిత్రి హీనా ఆల్ హాయ్ 'నేను మరణించిన తరువాత చెట్టులా జీవిస్తాను' అనే కవితలో "నా మరణం తరువాత నేను దేశమవుతాను/ ఎక్కడైతే పశువుల కంటే మనిషి ఖరీదు ఎక్కువో/ ఎక్కడైతే నిరసన పదం బుల్లెట్‌ని ఆర్జించదో/ వారసత్వ హక్కు కోసం పోరాడే వారిలో/ నేను మరణించినా జీవిస్తూనే ఉంటాను" అంటుంది. బేగం అస్మా ఖమాన్ 'స్వాతంత్ర్య దినం'లో "రేపు స్పష్టంగా స్వాతంత్ర్య దినం/ పుల్బామా వాళ్ళ అమ్మ ఖాళీ అన్నం కుండలో రోజు స్వాతంత్ర్య దినం పాటలు వినబడతాయి/ పుల్బామా వాళ్ళ అమ్మ వంటగదిలోకి ప్రవేశిస్తే/ ఆమె పిల్లలు ఆమెను చుట్టుముట్టి / అమ్మా ఆకలి అంటారు/ పుల్బామా వాళ్ల అమ్మ కళ్ల నుండి / స్వాతంత్ర్యం కారుతుంది / పుల్బామా వాళ్ల నాన్న మూడేళ్ల నిర్బంధ కేంద్రంలో ఉన్నాడు" స్వాతంత్ర్యం వచ్చాక కూడా వాళ్ల జీవితాలలో మార్పు లేదని చెప్తుంది. ఈ కవయిత్రుల్లో బలమైన గొంతు రెహనా సుల్తానాది. మియా కవిత్వం రాస్తున్నందుకు ఆమె మీద నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆమెకు ఎన్నో తిట్లూ బెదిరింపులూ ఎదురయ్యాయి. ఐనా ఆమె వాటికి భయపడలేదు. 'నా తల్లీ (మే 2016)' కవితలో "తల్లీ, నీ ఒడిలో నన్ను వదిలారు/ నా తండ్రి, తాత, ముత్తాతల్లానే / అయినా తల్లీ నువ్వు నన్ను తిరస్కరిస్తున్నావు/ ఒక్కసారి కళ్ళు తెరువు తల్లీ/ నీ పెదాలు విప్పు/ ఈ భూమి పుత్రులకు చెప్పు/ మేమంతా సోదరులమని/ నేను కేవలం మరొక బిడ్డని/ నేను మియా మర్మాంగాన్ని కాదు/ బంగ్లాదేశీని కాదు/ మియాని నేను ఒక మియా/ కవిత్వం ద్వారా పదాలు కూర్చలేను/ నా బాధని పాటగా పాడలేను" అంటూ తన బాధాతప్త హదయాన్ని వినిపించింది.

తమను పరాయి వారుగా, శత్రువులులాగా చూడడం పట్ల, నేరస్తులుగా భావించి హింసించడం పట్ల ఎలుగెత్తి చాటుతున్న ఆక్రోశాన్ని మియా కవితల్లో వింటాము. స్వాతంత్ర్యం వచ్చినా తమకు స్వాతంత్ర్యం లేకపోవడాన్ని గురించి మియా కవులు ఆగ్రహంతో నిరసన హోరును వినిపించారు. ఇలాంటి కవిత్వాన్ని అనువదించి మనకు అందించారు ముకుంద రామారావు. ఈ కవితలను చదివినప్పుడు ఎక్కడా ఇది అనువాదం అని మనకు అనిపించదు. మూల కవిత్వంలోని పరిమళాన్ని పట్టి తెచ్చి మనకు అందించడంలో ఆయన ప్రతిభ అనన్య సామాన్యం. తన సాహిత్యరంగ కృషికిగానూ జనవరి 7వ తేదీన విశాఖపట్నంలో అజో విభో పురస్కారం అందుకుంటు న్నారు ముకుంద రామారావు. బహుభాషా కోవిదులైన ముకుంద రామారావు అభ్యుదయవాది. మానవీయ కవిత్వాన్ని వెలువరించిన కవి. సామాన్యులు నిర్మించిన సాంస్కృతిక వారసత్వంపై అనేక వ్యాసాలు వెలువరించిన ప్రగతిశీలి. వారికి అభినందనలు.

– మందరపు హైమవతి

2న జీవన స్పర్శ నవల పరిచయ సభ

సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా రాసిన నవల 'జీవన స్పర్శ' పరిచయ సభ జనవరి రెండో తేదీ సాయంత్రం 7 గంటలకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సాహిత్య వేదికపై జరుగుతుంది. వొరప్రసాద్ అధ్యక్షతన జరిగే సభలో వి.కృష్ణయ్య, ఉషారాణి, రచయిత గనారా, సత్యాజీ తదితరులు పాల్గొంటారు.

5న 'నెవర్ ఎండ్' పుస్తకావిష్కరణ

తెలంగాణలో గత నలభై ఏళ్లుగా యువజనోద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన వీరుల చరిత్రను, రాష్ట్ర వ్యాప్తంగా 822 కిలోమీటర్లు మోటారు సైకిల్ యాత్ర చేసి, ఎం.విప్లవకుమార్, ఎ.విజయ్ కుమార్ వెలికితీసి రాసిన పుస్తకం 'నెవర్ ఎండ్' వీరులకు మరణం లేదు. ఈ పుస్తక ఆవిష్కరణ ప్రజాకవి జయరాజన్న జనవరి 5 – 2024, మధ్యాహ్నం 2 గంటలకు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో చేయనున్నారు. భూపతి వెంకటేశ్వర్లు సభాధ్యక్షత వహించనున్న ఈ సభలో ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, కవి యాకూబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, తగుళ్ళ గోపాల్, ఆనగంటి వెంకటేష్, దాసరి యువరాణి, సాత్విక నన్నెబోయిన పాల్గొంటారు.

– ఎ. విజయ్ కుమార్,
95737 15656

సామాజిక సమస్యల్ని చిలికిన కవిత్వం

సమీక్ష



ఉద్యమానికి ఊపిరులూదే పోరాటగడ్డ ఉద్దానం. ఆ ప్రాంతంలోని మారుమూల పల్లెలో పుట్టిన కవి బిడ్డ 'నిశితాసి'. అసలు పేరు వంకల రాజారావు. వృత్తిరీత్యా పాత్రికేయుడు. ప్రవృత్తి పరంగా కవి, గాయకుడు. 'కంజరి' వాయించడంలో దిట్ట. నాలుగు దశాబ్దాలుగా సాహితీ వ్యవసాయం చేస్తూనే ఉన్నాడు. గతంలో దండోరా గేయాలు, వీరగొన్నమ్మ గొల్ల సుద్దులు, ఉద్దానం పాట, కన్నోరి కథ వంటి రచనలతో సుపరిచితమైన రచయిత. ఇటీవలే 'కవ్వం' పేరుతో తన గేయ కవితల సంపుటిని వెలువరించారు. ఉత్తరాంధ్ర సామాజిక సమస్యల పోరాట నేపథ్యంతో ఊపిరి పోసుకున్న రచనల పొత్తం ఇది.

సహజ వచన శైలితో సరళ వాడుక భాషలో సొంత గొంతుతో కలవరిస్తూ పలవరించే నిలువెత్తు నిరసన స్వరం నిశితాసిది. ముక్కుసూటితనం ఎక్కువ. వస్తు విస్తృతితోపాటు పలు సామాజిక సమస్యల్ని విభిన్న కోణాల్లో ఎండగడుతూ తూర్పారబెట్టడం ఈ కవి అంతర్గత చైతన్య దృష్టిని తేటతెల్లం చేస్తుంది.

"ఆకాశం తుమ్మితే/ ఉప్పొంగిన జలపాతం కాదు
కఠిన శిలా రాళ్ళ నుంచి/ తన్నుకొచ్చిన గరిక మొలక జీవితం" అంటాడు 'జీవనరాగం' శీర్షికలో ఓ చోట. పలు ఆటుపోట్ల మధ్య నలిగి రాటుదేలిన సామాజిక జీవిత సంవేదనల్ని అనేక సుడులతో మెలికలు తిప్పి కాచి ఒడబోసిన అనుభవాలుగా తాత్త్విక దృష్టితో ఒడిసిపడతాడు. ఈ జీవన పోరాట సంఘర్షణల మధ్య అలుపెరగని సుదీర్ఘ రాజకీయ మలుపుల అంతర్వేదన ఆర్తిగా ముడిపడి ఉంది. మారుతున్న కాల పరిస్థితుల్ని మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేసి ఆకళింపు చేసుకొని చెప్పిన కఠోర సత్యాలివి. చరిత్ర ఎప్పుడూ ఒక జడ పదార్థం కాదు. అనేక సంక్షోభాల సమాహారాలతో పోటెత్తిన ఒక జనసముద్రం. దీని ఎల్లలను దాటి కాలం ముందుకు పోలేదు. ఈ తాత్త్విక భౌతిక సత్యాన్ని అంతర్లీనంగా చాటి చెప్పడమే ఈ కవి ఉద్దేశం.

"ఆది మానవుడెల్లి/ మర మనిషిని తెచ్చాడు
ఊరులన్నీ కలిసాయి/ ప్రపంచమే ఊరయ్యింది" అంటూ ఒక పరిణామ క్రమాన్ని "వద్దురా ఈ కులమూ" కవితలో చిత్రిస్తారు నిశితాసి. కొంచెం లోతుగా మథించి చూస్తే ప్రపంచీకరణ నేపథ్యంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చిన పెను విధ్వంసక మార్పులు ఆధునిక మానవ జీవన సరళి స్థితిగతుల్ని ఏ రీతిలో ప్రభావితం చేశాయో పొల్లుపోకుండా అక్షరరూపం ఇస్తాడు కవి. ప్రపంచమే ఒక కుగ్రామంగా రూపాంతరం చెందిన వైనాన్ని, వాటి దుష్ఫలితాల తీరుతెన్నుల్నీ నిప్పుల కుంపటి మీద మంటలా రాజేస్తాడు. అభివృద్ధి పేరుతో చాప కింద నీరులా ప్రపంచ దేశాల్ని ఆక్రమించుకున్న సామ్రాజ్యవాద ఛాయల్ని పరోక్షంగా వ్యక్తీకరిస్తాడు. మర మనిషి పేరుతో ఆధునిక యంత్రాలు రంగప్రవేశం చేసి లఘు, కుటీర పరిశ్రమల్ని, పారిశ్రామిక ఉత్పత్తుల్ని, శ్రామిక శక్తుల్ని ఏ విధంగా వర్గ దోపిడీ చేశాయో చిత్రిక పడతాడు.

"మన హక్కు ఉక్కు" శీర్షికలో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చెయ్యడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన గళాన్ని విప్పుతాడు నిశితాసి.

"వాయించు జముకు – పులిలా నీవు దుముకు
విశాఖ ఉక్కు మనదని – ఇది ఆంధ్రుల హక్కని
అమ్మినోడు ఎవడని – కొన్నోడు ఎవడని" గేయ శైలిలో ఉద్యమ స్వరాన్ని పతాక స్థాయిలో ఎలుగెత్తి చాటిచెప్పే ప్రయత్నం చేస్తాడు. "సెగ" కవితలో చెప్పినట్టు సెల్ ఫోన్ సృష్టించే అశ్లీలత మాయాజాలం వ్యవస్థలో పరాకాష్టకు చేరుకుంది.

"ఇప్పుడు మావూరొక బుల్లితెర/ అశ్లీల సుధ అందాల సొద
తేనెటీగల రొద/ శృంగారం సింగారించుకొని అంగాంగ ప్రదర్శన" చేస్తుంటే పెడతోవ పెట్టే యువతతోపాటు పిల్లల మీద కూడా అమిత ప్రభావాన్ని చూపిస్తోంది. ఈ సందర్భాన్నే కవి ప్రస్తావిస్తాడు. ఇదే శీర్షికలో ఇంకోచోట వర్తమాన విషాద దృశ్యాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా ఇలా చెబుతాడు :

""సెజ్'లొచ్చాయి/ సజ్జలు తినేసాయి
జల కలకల జాడలేదు/ హరితవనాల ఊసులేదు" అనడంలో మెలిపెట్టిన మర్మాన్ని గమనిస్తే, ప్రయోజనాల కన్నా, ప్రతికూల వ్యతిరేక ఫలితాలే అధికంగా ప్రతిబింబిస్తాయి.

అభివృద్ధి పేరుతో పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా విస్తరీకరణ జరిగి, ప్రకృతి పచ్చదనాన్ని నియంత్రించే కాలుష్యం కోరల్లో ఆధునిక మానవుడు బందీగా మారుతున్నాడు. 'సెజ్'ల పేరుతో కొండల్నీ, గుట్టల్నీ, పంటపొలాల్నీ దొలిచేస్తూ, భవంతులు కట్టడాల రూపంలో ప్రకృతి వినాశనానికి పెద్దపీట వేస్తున్న వైనం సరిదిద్దుకోలేని తప్పుగా పరిణమిస్తోంది. ఈ పోకడలో మార్పులు రావాలని ఆశించే గొంతుల్లో ఈ కవి కూడా ముందు వరుసలో ఉన్నాడు. ఇలాంటి సందర్భాన్ని పోలిన మరో కోణాన్ని 'మూత్ర గండం' కవితలో బలంగా నొక్కి చెబుతాడు.

"గాలీ నేలా నీరు/ నీ పంచ ప్రాణాలు
కాలకూట విషం లాగ/ అవి కలుషితమవుతుంటే
లేత చిగురుటాకుల ఉద్దానమా/ పండుటాకులై రాలిపోవడమేనా" అంటూ ధ్వనించే స్వరంతో పర్యావరణ కాలుష్య తీవ్రతని, రాబోయే ముప్పుని ప్రత్యక్షంగా హెచ్చరిస్తాడు నిశితాసి. బతుకు పచ్చని బీల ప్రాంతమంతా మూత్రపిండాల వ్యాధి బారిన పడి అనారోగ్యానికి గురయ్యే నేపథ్యాన్ని సమస్యాత్మకంగా చిత్రిస్తాడు.

ఉద్దానం అనేసరికి బీల తీరప్రాంతం కళ్ళ ముందు మెదులుతుంది. ఉత్తరాంధ్ర ముఖచిత్రంలో ఒక ప్రధాన పార్శ్వమైన చేపలవేట మత్స్యకారుల బతుకుల్లో దినదిన మృత్యుగండంగా రూపాంతరం చెందుతోంది. కెవిట్లు, కురవాకులు, వాడబలిజ, జాలర్లు ఇలా ఎందరెందరో తమ తెప్పలపై, మరబోట్లపై వలల్ని విసురుతూ నిత్యం బతుకు యుద్ధం చేస్తూనే ఉంటారు. ఈ ప్రకృతి విలయతాండవంలో అల్లకల్లోల సముద్ర కెరటాల ఉగ్రరూపానికీ, పోటెత్తే భీభత్సాలకీ వాళ్ళ జీవితాలు జీవన్మరణ ప్రతీకలుగా నిలుస్తాయి. ఆ సందర్భాన్నే కవి కవిత్వమయం చేశాడు.

దళారోలు కొబ్బరి రైతుల జీవితాల్ని దోచుకొని దోపిడీచేసే తీరును "కొబ్బరి రైతన్నా" శీర్షికలో అక్షరీకరిస్తాడు.

"దళారోలు దిగుతారు/ నిలువెల్ల దోచుకుంటారు
మహామాయగాళ్ళమ్మో/ మార్వాడీలొస్తారు
ఓరిమి కూరిమి చూపిస్తారు/ ఉన్నది పట్టుకుపోతారు" అంటూ జరిగే సామాజిక దోపిడీని బహిరంగంగా నిరసిస్తాడు. కనీస మద్దతు ధర పలకలేని ఒక నిస్సహాయ స్థితిలో అమాయక కొబ్బరి రైతుల మూగ వేదనని చారిత్రక సందర్భంగా గుర్తు చేస్తాడు రాజారావు.

సుబ్బారావు పాణిగ్రహి, గంటి రాజేశ్వరరావు, కొర్రాయి గణపతి, మార్పు పద్మనాభం, తరుణాచారి, గున్నమ్మ తదితరుల అలుపెరగని పోరాటాలను కథల వ్యథలుగా చిత్రిస్తాడు. సమసమాజ స్థాపనకోసం వాళ్ళు చేసిన త్యాగాలను సజీవ దృశ్యాలుగా ఆవిష్కరిస్తాడు. కారంచేడు, వాకపల్లి, మణిపురి కన్నీటికథలు, ఛిద్రమవుతున్న వలస కూలీలు, జీడు, కొబ్బరి రైతుల జీవితాలు, ధర్మల్ ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమం వంటి అంశాలను ప్రస్తావిస్తాడు. వరద బీభత్సంలో భాగంగా తితిలీ, సునామీ, గోదారమ్మ లాంటి ప్రకృతి విలయ విపత్తుల్ని స్ఫురణకు తెస్తాడు. కరోనా రోజుల నాటి మృత్యు క్షణాల్ని భయకంపిత స్మృతులుగా నెమరేసుకుంటాడు.

ఈ కవ్వం చిలికిన కవిత్వంలో హృదయాన్ని తాకే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. చదివి చవి చూడొచ్చు. ఉద్దానం సముద్ర తీరప్రాంత వాసుల సమస్యలనూ, కడగండ్లనూ బొమ్మ కట్టిస్తూ అక్షర రూపం ఇచ్చిన 'కవ్వం' గేయకవితా సంపుటిని, కవి నిశితాసిని పాఠకులు అభినందిస్తూ ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాను. కవి సెల్ నెంబర్ : 97045 70198.

– మానాపురం రాజా చంద్రశేఖర్
77940 39813

కొత్త వెలుగుల పంట

అన్నా...
కొత్త సంవత్సరం వచ్చిందంటే
కోటి చుక్కల్ని తెంపి
కళ్ళల్లో నింపుకుంటావ్
కొత్త కోర్కెల్ని తెచ్చి
గుండెల్లో వొంపుకుంటావ్

రంగు రంగుల ముగ్గుల్ని
రుతువుల మాగాణం నిండా
మొక్కలు మొక్కలుగా
అలంకరించుకుంటావ్!
వెండి జిలుగుల మబ్బుల్ని
కల్లం నాపరాయి నిండా
కంకులు కంకులుగా
కుప్పలు పోసినట్టు కలలు కంటావ్!

అప్పుడాక్షణం ఏ తర్కబద్ధ ఆలోచనా
నీ మెదడులో మొలకెత్తదు
మారే కాలానికి బతుకుల్ని
మార్చేంత మహత్తు ఉండదన్న వాస్తవం
నీ జ్ఞానేంద్రియాలకు స్ఫురించదు

కానీ, అన్నా ... కనిపిస్తున్న
కఠిన వాస్తవం అదే కదా!
కాలం మూగది
ఎవ్వరినీ ఏమీ అనలేనిది
ఏ భావోద్వేగాలకూ లొంగని
మౌన గడియారంలో ముల్లు లాంటిది!

చేతికొచ్చిన చెమటపంట
నోటికందకుండా
ప్రకృతి లాక్కుపోతేనో
కుత్రల గుంటనక్కలు తన్నుకుపోతేనో
కాపాడలేదని కాలాన్ని నిందిస్తే
ప్రయోజనం ఏముంటుందన్నా!
జీవితం ఎప్పుడూ
కాలం ఒళ్ళోంచి వూడిపడదు!
కాలం నీ గాయాలను మాన్పే
గ్యారంటీ కార్డు కాదు కదా!

కారణాలు పసికట్టి
బతుకు పోరాటంలో
యుద్ధ తంత్రాన్ని మార్చాల్సిందే!

దశాబ్దాల తరబడి నువ్వు నడుస్తున్న దారి
గుంటలు పడి మురుగు నీరు చేరి
అడ్డమైన బురద పందులూ దొర్లుతున్నప్పుడు
నీ కార్యాచరణ కాలి బాటను
మరమ్మతులు చేస్తే సరిపోతుందా?
చైతన్యవంతమైన కొత్త రోడ్డును నిర్మించుకుంటేనే
పండించుకున్న కొత్త వెలుగుల పంట
నోటికందుతుంది!
తుమ్మ డొంకలు మొలిచిన
బతుకు బంజరు భూమి సారవంతమై
అడ్డ గాడిదల్ని అడ్డుకుంటుంది!

– పతివాడ నాస్తిక్
94417 24167

18 ఏళ్ల దళిత యువతిపై అమానుషం

- బెల్లం తయారీ కొలిమిలోకి తోసేశారు

లక్నో: లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు ఓదళిత యువతిని బెల్లం తయారీ యూనిట్‌లోని కొలిమిలోకి తోసేశారు. ఈ దారుణ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని బుదౌన్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం ఆమె ఢిల్లీలోని జిటిబి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది, ఆ బెల్లం తయారీ యూనిట్ యజమానితో సహా ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బినౌలీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంపి సింగ్ మాట్లాడుతూ ముజఫర్‌నగర్‌లో నివాసం ఉండే మహిళ ఆ గ్రామంలోని ప్రమోద్ వద్ద పని చేస్తోంది. బినౌలీ సోదరుడు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నదాని ప్రకారం బుధవారం, ఆమె బెల్లం తయారీ కొలిమి వద్ద పనిచేస్తుండగా, ప్రమోద్, రాజు, సందీప్‌లతో కలసి వేధించారు. అసభ్యంగా ప్రవర్తించారు.. దీనికి బినఃలి నిరసన తెలపడంతో ఆ ముగ్గురూ ఆమెను చంపాలనే ఉద్దేశంతో మండుతున్న కొలిమిలోకి తోసేశారు. కులం పేరుతో దూషించారు. అనంతరం ముగ్గురు నిందితులు పరారయ్యారు.

ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులు ప్రమోద్, రాజు, సందీప్‌లపై సెక్షన్ 354 (ఆమె నిరాడంబరతను కించపరిచే ఉద్దేశంతో మహిళపై దాడి లేదా నేరపూరిత బలవంతం), 504 (ఉల్లంఘనను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం) కింద కేసు నమోదు చేసి, వారిని . అరెస్టు చేశారు.

చెట్ల అక్రమ నరికివేత కేసులో బిజెపి ఎంపి ప్రతాప్ సింహా సోదరుడు అరెస్ట్

బెంగళూరు : పార్లమెంట్ భద్రతా వైఫల్య ఘటనలో నిందితులకు విజిటింగ్ పాస్ ఇచ్చిన బిజెపి ఎంపి ప్రతాప్ సింహా సోదరుడు విక్రమ్ సింహా అరెస్టయ్యారు. కోట్లాది రూపాయల విలువైన చెట్లను నరికినందుకు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం అటవీ శాఖ కస్టడీలో ఉన్నారు. కర్ణాటక హసన్ జిల్లాలో రూ.126 కోట్ల విలువైన చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ కేసులో విక్రమ్ ప్రమేయం ఉన్నట్లు 'అందుబాటులో ఉన్న డాక్యుమెంటరీ సాక్ష్యం' సూచించిందని అధికారిక నివేదిక పేర్కొంది. అటవీశాఖ అధికారులు, క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి, విక్రమ్‌ను అరెస్ట్ చేశాయి. ఆయనను హసన్‌కి తరలించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తెహ్రీక్ -ఎ-హురియత్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ : కాశ్మీర్ వేర్పాటువాద సంస్థ తెహ్రీక్-ఎ- హురియత్ (టిఇహెచ్)పై కేంద్ర ప్రభుత్వం ఆదివారం నిషేధం విధించింది. జమ్ముకాశ్మీర్‌లో ఈ సంస్థ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని, తీవ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తోందని గుర్తించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. "చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద తెహ్రీక్-ఎ-హురియత్ జెకెను చట్టవిరుద్ధ సంఘంగా ప్రకటించారు. భారత్ నుండి జమ్ముకాశ్మీర్‌ను వేరుచేసి ఇస్లామిక్ పాలనను స్థాపించేందుకు ఈ సంస్థ నిషేధిత కార్యకలాపాలలో పాల్గొంటోంది" అని అమిత్‌షా ఎక్స్ లో పేర్కొన్నారు. టిఇహెచ్‌కి గతంలో సయ్యద్ అలీ షా గిలానీ నాయకత్వం వహించారు. ఆయన మరణానంతరం మసరత్ ఆలం భట్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం భట్ జైలులో ఉన్నారు. ఆయన పార్టీ ముస్లిం లీగ్ ఆఫ్ జమ్ముకాశ్మీర్‌ను డిసెంబర్ 27న కేంద్రం నిషేధిత సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

పెరుగుతున్న కుక్కకాటు కేసులు

- ఏడాదిలో ఆరు లక్షల కేసుల పెరుగుదల

న్యూఢిల్లీ : దేశంలో కుక్కకాటు కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2022తో పోలిస్తే 2023లో దాదాపు ఆరు లక్షల కేసులు పెరిగాయి. కుక్కకాటుకు గురైన వారిలో రాబిస్ వ్యాధితో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అధికంగా ఉంటోంది. 2030 నాటికి దేశంలో రాబిస్ పూర్తిగా నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కన్పించడం లేదు. రాబిస్‌ను సమూలంగా నిర్మూలించే విషయంపై గత నెలలో నీతి ఆయోగ్ జాతీయ స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. వ్యాధి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాలపై ప్రజలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

డిసెంబర్ ప్రారంభం నాటికి దేశంలో మొత్తం 27.5 లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. 2022లో వచ్చిన 21.8 లక్షల కేసులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కుక్కకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారిలో 96% మరణాలకు రాబిస్ వ్యాధే కారణమని అధికారులు చెబుతున్నారు. 2015లో దేశంలో రాబిస్ కారణంగా 20,847 మంది చనిపోయారు. ప్రపంచ దేశాలన్నింటితో పోలిస్తే ఈ సంఖ్య బాగా ఎక్కువ. ప్రపంచంలో ప్రతి సంవత్సరం 60 వేల మంది నయం చేయడానికి వీలుకాని వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు, ఆరోగ్య సిబ్బందిలో అవగాహన లేకపోవడంతో రోగులకు సకాలంలో చికిత్స అందించలేకపోతున్నారు.

పోరాట నామ సంవత్సరం

2023 రౌండప్

న్యూఢిల్లీ : కాలగర్భంలో మరొక ఏడాది కలిసిపోయింది. 2023 గత జ్ఞాపకంగా మిగిలిపోయింది. అయితే 2023ను పోరాట నామ సంవత్సరంగా మనకు గుర్తుండి పోతుంది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా,కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా 2023లో అనేక ప్రజా పోరాటాలు, ఆందోళనలు జరిగాయి. ఈ ఐక్య పోరాటానికి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే పూర్తి శక్తి ఉంది. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం పావులుగా ఉపయోగించుకోవడంపైనా పోరాటాలు ఉధృతమ య్యాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రెజ్లర్లు పోరాటానికి దిగారు. సుమారు మూడు నెలల ఆందోళన తరువాత బ్రిజ్‌భూషణ్‌ను కేంద్రం తొలగించింది. 2023లో జరిగిన కొన్ని ముఖ్యమైన రాజకీయ పరిణామలు..

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం



అంత్యకట్టుదిట్టమైన భద్రత ఉండే పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం చోటు చేసుకోవడం 2023లో మరొక ముఖ్యమైన ఘటన. అదీ కూడా పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి జరిగి 22 ఏళ్లు పూర్తయిన రోజున ఇద్దరు యువకులు లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ఎంపీల సీట్లపైకి హఠాత్తుగా దూకారు. వారు డబ్బాలో నుండి పసుపు రంగు పొగను స్ప్రే చేశారు. ఈ సంఘటనతో ఎంపీలు, పార్లమెంట్ సిబ్బంది ముందుగా ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే కొంతమంది ఎంపీలు ఈ ఇద్దరు యువకులను బంధించారు. పట్టుబడిన సాగర్ శర్మ, మనోరంజన్ అనే ఇద్దరు యువకులు బిజెపి ఎంపీ ప్రతాప్ సింహ 'పాస్'తో లోక్‌సభ గ్యాలరీకి ప్రవేశించారు. ఏదీమైనా ఈ ఘటన కొత్త పార్లమెంట్ భవనం వద్ద భద్రతా లోపాలను ఎత్తిచూపింది.

జర్నలిస్టులపై దాడులు

ప్రతిపక్ష నేతలతో పాటు తమకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న ఉద్యమకారులు, జర్నలిస్టులపై మోడీ ప్రభుత్వం నిరంకుశ దాడులకు పాల్పడింది. అక్టోబర్‌లో ఢిల్లీ పోలీసులు సమారు 50 మంది జర్నలిస్టులు, రచయితల ఇళ్లపై దాడులు చేశారు. 'న్యూస్‌క్లిక్' వెబ్‌సైట్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ మీడియా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అమిత్ చక్రవర్తిలను అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై ఉపా చట్టం కింద కేసు బనాయించింది. జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు పోలీసులు ఎత్తుకెళ్లారు. రాజధాని ఢిల్లీలోనే కాదు ఏకంగా 5 నగరాల్లో దాదాపు యాభై చోట్ల పోలీసులు దాడులు చేశారు. ఎడిటర్స్ గిల్డ్‌తో సహా అనేక జర్నలిస్టుల సంస్థలు ఈ ఆపరేషన్‌ను ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి.

ఫోన్లపైనా..నిఘా

మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయుకులను, జర్నలిస్టులను వేధించడంతో వారి ఫోన్లను స్పైవేర్‌తో నిఘా ఉంచుతుందనే వార్తలు 2023లో వెలుగు చూడ్డం పెద్ద ఎత్తున కలకలం రేపింది. సంవత్సర ప్రారంభంలో ఇలాంటి వార్తలు వచ్చాయి. చివరిలో కూడా సీతారాం ఏచూరి, రాహుల్ గాంధీ, శశి థరూర్ వంటి ప్రతిపక్ష నేతల ఫోన్‌లు హ్యాక్ అవుతున్నాయని ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ నుంచి హెచ్చరికలు అందాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని హ్యాకర్లు ఈ పని చేస్తున్నారని, ఎవరు ఏం చేస్తారో తెలుసుకోవడానికి ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఐఫోన్ హెచ్చరించినట్లు ఈ నాయుకులు తెలిపారు. సంవత్సరంలో ముందుగా వచ్చిన పెగాసస్ స్పైవైర్ ఆరోపణలపై మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ సమాధానం చెప్పలేదు. ఇక ఐఫోన్ హ్యాకింగ్ ఆరోపణలుపై అస్సలు స్పందించనేలేదు.



డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషన్ లైంగిక వేధింపులకు నిరసనగా ఆందోళన చేస్తున్న రెజర్లు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



2023లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వార్తల్లోని నిలిచిన మరోక ముఖ్యమైన అంశం. అయితే ఈ ఎఐ కొత్త ఆశలను, భయాలను రెండింటినీ పెంచింది. 2023లో భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధస్సుతో నడిచే న్యూస్ రీడర్ ఒక టెలివిజన్ ఛానెల్‌లో దర్శనమిచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఇప్పటికే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఎఐ విస్తృత ఉపయోగంతో కొన్ని రంగాల్లో అవకాశాలు మరింత మృగ్యమవుతాయని ఆందోళనలు పెరిగాయి. అయితే ఎఐతో కొన్ని ఉద్యోగాలు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు.

17 రోజులు సొరంగంలోనే.

ఉత్తరాఖండ్‌లోని సిల్కియారా సొరంగంలో 17 రోజులు పాటు 41 మంది కార్మికులు చిక్కుకుని ఉండటం అందర్ని ఆందోళనకు గురిచేసింది. అయితే వీరిని ఎట్టేకేలకు సురక్షితంగా బయటకు తీసుకుని రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే అత్యాధునిక యంత్రాలు, ఆగర్ మెషిన్లు, ఉన్నత చదువులు చదివిన ఉద్యోగులు చేయలేని పనిని ర్యాట్ హోల్ వర్కర్లు చేశారు. సొరంగంలో చిక్కుక్కుపోయిన కార్మికులను కాపాడారు. ఈ క్షణాలను దేశం మొత్తం ఆత్రుతగా చూసింది, మతం, భాష, కుల భేదాలను చెరిపివేసి ర్యాట్ వర్కర్లు సొరంగం లోపల నుండి వారిని ఒక్కొక్కరుగా బయటకు తీసుకువచ్చారు.

146 మంది ఎంపీలపై వేటు


భారత పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మోడీ ప్రభుత్వం ఏకంగా ఈ ఏడాది 146 మంది ఎంపిలపై బహిష్కరణ వేటు వేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, న్యాయమైన డిమాండ్లు చేయడమే ఈ 146 మంది ఎంపిల నేరమయింది.

ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనను 'అన్‌పార్లమెంటరీ బిహేవియర్'గా ఆరోపిస్తూ మోడీ ప్రభుత్వం ఈ వేటు వేసింది. అయితే వివాదాస్పద బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు, వ్యతిరేక స్వరాలకు అడ్డుకట్ట వేసేందుకు మోడీ ప్రభుత్వం ఈ వ్యూహం పన్నినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశాయి. అయితే తమ ఎంపీని సస్పెండ్ చేసినా తృణమూల్ కాంగ్రెస్ ఈ నిరసనల్లో పాల్గొనలేదు.

బాలేశ్వర్‌లో ఘోర రైలు ప్రమాదం

జూన్‌లో ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంతో దేశం ఒక్కసారిగా ఉల్కిపడింది. ఈ రైలు ప్రమాదంలో 300 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మూడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఒక సరుకు రవాణా రైలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఒకే లైన్‌లో ప్రమాదానికి గురికావడంతో రైల్వే భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జాన్ పిల్జర్ కన్నుమూత



లండన్ : ప్రపంచ ప్రఖ్యాత జర్నలిస్టుల్లో ఒకరు, హక్కుల కార్యకర్త, డాక్యుమెంటరీ మేకర్ జాన్ పిల్జర్ (84) శనివారం నాడు ఇక్కడ తుది శ్వాస విడిచారు. పిల్జర్ ఇక లేరన్న వార్తను ఆయన కుటుంబ సభ్యులు ఎక్స్ (గతంలో ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. పాలస్తీనా నుండి కంబోడియా దాకా, వియత్నాం, ఇరాక్ దాకా అమెరికన్ సామ్రాజ్యవాదుల దురాక్రమణపూరిత యుద్ధాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న బాధలను కళ్లకు కట్టినట్లు తన వార్తా కథనాలు, డాక్యుమెంటరీల్లో చూపించారు. కలాన్ని అత్యంత పదునైన ఆయుధంగా ఉపయోగించడంలో ఆయనకు ఆయనే సాటి. సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా ప్రపంచాన్ని మేల్కొలిపేందుకు జీవితాంతం పోరాడిన వ్యక్తి ఆయన. తాజాగా ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న ఊచకోతను పిల్జర్ తీవ్రంగా విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియస్ అసాంజెకు బాసటగా నిలిచారు. ఆస్ట్రేలియాలో జన్మించిన పిల్జర్ జర్నలిజంలో రాజీపడని వ్యక్తిగా పేరుతెచ్చుకున్నారు. సిడ్నీలో హైస్కూల్ స్థాయిలోనే వార్తపత్రికను ప్రారంభించిన పిల్జర్ తరువాత యూరప్‌కు వెళ్లారు. 1962లో ఇంగ్లండ్‌లో ఫ్రీలాన్సర్‌గా పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. తరువాత రాయిటర్స్ వార్తా సంస్థలో చేరారు. అటు పిమ్మట లండన్ డైలీ మిర్రర్‌కు ప్రధాన విదేశీ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ప్రపంచంలో వివిధ యుద్ధాలను కవర్ చేశారు. వీటిల్లో వియత్నాం యుద్ధం ప్రధానమైనది. ఇంగ్లండ్ నుంచి అమెరికా వెళ్లిన పిల్జర్ 1970వ దశకంలో అమెరికాలో జరిగిన తిరుగుబాట్లపై అనేక కథనాలు రాశారు. అలాగే కంబోడియా, తూర్పు తైమూర్ నుంచి పిల్జర్ రాసిన కథనాలు సంచలనం సృష్టించాయి. వార్త నివేదికలతో పాటు పలు డాక్యుమెంటరీలను ఆయన రూపొందించారు. పలు పుస్తకాలు రాశారు. ముఖ్యంగా తన సొంత దేశం ఆస్ట్రేలియాపై రూపొందించిన ది సీక్రెట్ కంట్రీ (1983), బైసెంటరీ త్రయం ది లాస్ట్ డ్రీమ్ (1988), వెల్‌కమ్ టూ ఆస్ట్రేలియా (1999), యుటోపియా (2013) విశేష ప్రాచుర్యం పొందాయి. అలాగే జర్నలిజంపై రచించిన 'హిడెన్ ఎజెండాస్' పుస్తకం విశేషాదరణ పొందింది.

మహారాష్ట్రలో అగ్ని ప్రమాదం

ముంబయి : మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. గ్లోవ్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరగటంతో ఆరుగురు మరణించారు. అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ అగ్ని ప్రమాదం సమయంలో ఫ్యాక్టరీ మూసివేసి ఉన్నదని, ఆ సమయంలో తాము ఫ్యాక్టరీ వద్ద నిద్రిస్తున్నామని కార్మికులు తెలిపారు. "మాకు ఉదయం 2.15 గంటలకు కాల్ వచ్చింది. ఘటనా ప్రదేశానికి చేరుకునే సమయానికి మొత్తం ఫ్యాక్టరీ మంటల్లో ఉన్నది. అధికారులు ప్రవేశించి ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు " అని అగ్నిమాపక శాఖాధికారి మోహన్ ముంగ్సే తెలిపారు.

841 కొత్త కేసులు

న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి కేసులు పెరుగుతున్నాయి. కొత్తగా 841 కేసులు నమోదయ్యాయి. గత 227 రోజుల్లో ఇవే అత్యధిక కేసులు కావటం గమనార్హం. దీంతో మొత్తం కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4309కి చేరుకున్నాయి.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో చివరగా ఈ ఏడాది మే 19న 865 కరోనా కేసులు నమోదయ్యాయి. కొత్త వేరియంట్, శీతాకాలపు వాతావరణ పరిస్థితుల కారణంగా కేసులు తీవ్రమవుతున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలి



- ఐసిజెను కోరిన దక్షిణాఫ్రికా

జొహానెస్‌బర్గ్: గాజాలో పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలని అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం (ఐసిజె)ను దక్షిణాఫ్రికా కోరింది. యూదు దురహంకార సైన్యం గాజాపై దురాక్రమణ పూరిత దాడులు 84వ రోజు (డిసెంబరు29)కు చేరిన వేళ దక్షిణాఫ్రికాలోని రమాఫోసా ప్రభుత్వం అంతర్జాతీయ నేర విచారణ కోర్టులో ఈ మేరకు ఒక పిటిషన్ దాఖలు చేసింది. నెతన్యాహును ప్రాసిక్యూట్ చేయడంతో బాటు, గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే నిలుపు చేసేలా ఆదేశించాలనికోరింది. ఇజ్రాయిల్ హంతక దాడులు ఊచకోత స్వభావాన్ని కలిగి ఉన్నాయని, పాలస్తీనాలో చాలా ప్రాంతాన్ని నాశనం చేశాయని, ఇజాయ్రిల్ దళాలు జాతి నిర్మూలనే లక్ష్యంగా గాజాలో రక్తపుటేరులు పారిస్తున్నాయని, దీని వల్ల అక్కడి పాలస్తీనీయులు భౌతికంగా, మానసికంగా అనుభవిస్తున్న క్షోభ వర్ణనాతీతమని ఆ పిటిషన్‌లో దక్షిణాఫ్రికా పేర్కొంది. అంతేకాదు, పాలస్తీనీయులను తమ ఇళ్ల నుంచి బలవంతంగా గెంటివేయడం, సామూహికంగా నివాస ప్రాంతాలపై దాడులు, ఇళ్లను నేలమట్టం చేయడం వంటి దాష్టీకాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ఆహారం, మందులు, గూడు, పరిశుభ్రత, పారిశుధ్యం ఇలా అనేక సమస్యల మధ్య అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పిటిషన్‌లో తెలిపింది. పాలస్తీనా ప్రజల జీవితానలు నాశనం చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించింది. పాలస్తీనీయులు గాజా గడ్డపై జన్మించకుండా చేసేందుకు ఆసుపత్రులపైనా దాడులకు తెగబడిందని విమర్శించింది. అక్టోబరు 7 నుంచి ఇప్పటివరకు 22 వేల మంది దాకా పాలస్తీనీయులు చనిపోయారు. మరో 7,780 మంది జాడ తెలియడం లేదు. బహుశా వీరంతా భవన శిథిలాల కింద సమాధి అయిపోయి వుండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫాసిస్టు దాడుల వల్ల 19 లక్షల మంది అంటే గాజా జనాభాలో 85 శాతం మంది బాంబు దాడుల్లో ఇళ్లు కోల్పోయి వీధిన పడ్డారు. గాజాలో పాలస్తీనా కుటుంబాల్లో మరణాల రేటు పెరిగిపోయిందని డబ్ల్యుసిఎన్ఎస్ఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ హంతక దాడుల్లో కొన్ని కుటుంబాల్లో గాయపడిన ఒక బాబు లేదా పాప మాత్రమే మిగిలి మిగతా వారంత చనిపోయిన పరిస్థితి ఉంది. మృతుల్లో పిల్లలు, మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. అని ఆ పిటిషన్‌లో పేర్కొంది. హేగ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రాజకీయాలకు, పక్ష పాతానికి అతీతమైనదేమీ కాదని పలు సందర్భాల్లో రుజువైంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో పశ్చిమ దేశాల ప్రభావంతో పుతిన్‌ను యుద్ధ నేరస్తుడిగా ఏకపక్షంగా ప్రకటించిన ఐసిజె, గాజాలో ఇన్ని రోజులుగా, ఇంత భయానకంగా పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న నెతన్యాహు విషయంలో గమ్మున ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికా ప్రభుత్వ అభ్యర్థనపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఖాన్ యూనిస్ సిటీపై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్ దళాలు : 35 మంది మృతి

ఆదివారం సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 35 మంది చనిపోయినట్లు ఆసుపత్రి అధికారి తెలిపారు. కాల్పుల విరమణ ప్రకటించాలని అంతర్జాతీయ సమాజం చేస్తున్న డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ, దాడులు ఆపేది లేదని, మరి కొన్ని నెలల పాటు కొనసాగుతాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు హూంకరించిన మరుసటి రోజే సెంట్రల్ గాజాలోని రెండవ అతి పెద్ద నగరం ఖాన్ యూనిస్ పై తీవ్ర స్థాయిలో ఇజ్రాయిలీ దళాలు విరుచుకుపడ్డాయి.

ఎర్ర సముద్రంలో మరో నౌకపై దాడి

ఎర్ర సముద్రంలో మరోక వాణిజ్య నౌకపై దాడి జరిగింది. సింగపూర్ నుంచి ఈజిప్టులోని పోర్ట్ సూయెజ్‌కు బయలుదేరిన హాంగ్‌జౌ అనే వాణిజ్య నౌక ఆదివారం ఉదయం 6:30 గంటలకు బాబ్ అల్-మాండెబ్ జలసంధి దాటి దక్షిణ ఎర్ర సముద్రంలోకి ప్రవేశించిన సమయంలో ఈ దాడి జరిగింది. దాడికి గురువుతున్న సమయంలో యెమెన్‌లోని హోడైదాకు నైరుతి దిశలో ఈ వాణిజ్య నౌక ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించింది. ఈ దాడిలో నౌక పెద్దగా నష్టానికి గురికాలేదని తెలిపింది. అయితే నౌకపై దాడి చేయడానికి ప్రయత్నించి హౌతీ ఫైటర్స్‌కు చెందిన నాలుగు చిన్న పడవల్లో మూడు పడవలను సముద్రంలో ముంచివేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.



గవర్నర్ ఆర్ఎన్ రవితో భేటీ అయిన తమిళనాడు సిఎం స్టాలిన్, మంత్రులు

పెండింగ్ బిల్లులు ఆమోదించండి

- గవర్నర్‌తో స్టాలిన్ భేటీ

చెన్నయ్ : పెండింగ్ బిల్లులు, ఫైళ్లకు ఆమోదం తెలపాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని కోరారు. అపరిష్కృత అంశాలను పరిష్కరించుకునేందుకు గవర్నర్‌తో భేటీ కావాలని సుప్రీంకోర్టు సలహా ఇచ్చిన నేపథ్యంలో తన క్యాబినెట్ సహచరులతో కలిసి సిఎం గవర్నర్‌తో సమావేశమయ్యారు. పెండింగ్ బిల్లులు, ఫైళ్లకు ఆమోదం తెలపాల్సిందిగా ముఖ్యమంత్రి మరోసారి గవర్నర్‌ను కోరారని, రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రితో తరచూ సమావేశం కావాలని కూడా ఆయన ఆకాంక్షించారు.

పెండింగులో ఉన్న బిల్లులు, ఫైళ్లపై రాజ్‌భవన్ పెదవి విప్పలేదు. సమావేశం అనంతరం రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి విలేకరులతో మాట్లాడుతూ ఈ భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగిందని చెప్పారు. దీని ఫలితం న్యాయస్థానంలోనే తెలుస్తుందని అన్నారు. పెండింగ్ బిల్లులు, ఫైళ్ల వివరాలతో గవర్నర్‌కు స్టాలిన్ ఓ లేఖను అందజేశారు. రాజ్యాంగ పదవులపై తనకు అపార గౌరవం ఉన్నదని అందులో పేర్కొన్నారు. ప్రజలు, ప్రభుత్వ పరిపాలన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇద్దరు మాజీ మంత్రులను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాల్సిందిగా తాము చేసిన అభ్యర్థన రాజ్‌భవన్‌లో పదిహేను నెలలుగా పెండింగులో ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర శాసనసభ తిరిగి ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపారని రఘుపతి చెప్పారు.

ప్రధాని క్రూరత్వం బాధ కలిగిస్తోంది : రాహుల్ గాంధీ


న్యూఢిల్లీ బ్యూరో: మహిళా రెజ్లర్ల పట్ల ప్రధాని క్రూరత్వం చూస్తుంటే బాధ కలుగుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ప్రముఖ రెజ్లర్ వినేష్ ఫోగాట్ ఖేల్ రత్న, అర్జున అవార్డులను కర్తవ్యపథ్‌లోని పేవ్‌మెంట్‌పై విడిచిపెట్టిన సంగతి తెలిసిందే. తన పతకాలను ప్రధానికి అందించేందుకు వినేష్ ఫోగాట్ బయలుదేరిన వీడియోను ఎక్స్‌లో రాహుల్‌గాంధీ షేర్ చేస్తూ, తన వ్యాఖ్యలను జత చేశారు. 'దేశంలోని ప్రతి కూతురికి ఆత్మ గౌరవమే మొదటి ప్రాధాన్యం. ఆ తర్వాతే ఏదైనా పతకం, గౌరవం వస్తాయి. ఈ ధీర వనితల కన్నీళ్ల కంటే 'బాహుబలి'గా ప్రకటించుకునే వారి నుంచి కలిగే రాజకీయ ప్రయోజనాలు ఎక్కువయ్యాయా? యావత్ దేశానికి ప్రధానమంత్రి సంరక్షకుడు. ఆయన వైపు నుంచి ఇటువంటి క్రూరత్వం చూస్తుంటే బాధ కలుగుతోంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. తనకు వచ్చిన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్న వినేశ్ ఫొగాట్.. వాటిని ప్రధాని నరేంద్ర మోడీకి అందజేసేందుకు శనివారం వెళ్లగా, ఆమెను పోలీసులు అడ్డుకోవడంతో వాటిని కర్తవ్యపథ్ వద్ద వదిలేశారు. అనంతరం వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికవడాన్ని నిరసిస్తూ.. అవార్డులను వెనక్కి ఇచేస్తామని వినేష్ ఫోగాట్ గతంలో ప్రకటించారు. రెజ్లర్లు న్యాయం కోసం పోరాడుతుంటే ఈ పతకాలు, సన్మానాలు అర్థరహితమని పేర్కొన్నారు.

దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది దేశం ఎన్నో ఘనతలు సాధించిందని గుర్తుచేశారు. 2023లో దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి రగిలిందన్నారు. దాన్ని కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రసారమైన 2023 చివరి 'మన్ కీ బాత్'లో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లుకు ఈ ఏడాదిలోనే ఆమోదం లభించిందన్నారు. భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి ప్రాంతం ఎంతో ఆత్మవిశ్వాసంతో నిండి ఉందని, దేశ ప్రజల్లో వికాస, స్వయం సమృద్ధి స్ఫూర్తి రగిలిందని చెప్పారు. 2024లోనూ దాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ ఏడాది 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో దేశం మొత్తం ఉర్రూతలూగిందని మోడీ అన్నారు. 'ఎలిఫెంట్ విస్పరర్స్'కు సైతం ప్రతిష్టాత్మక అవార్డు రావటంతో భారతీయుల ప్రతిభ వెలుగుచూసిందని వ్యాఖ్యానించారు. ఆసియా క్రీడల్లో 107, పారా గేమ్స్‌లో 111 పతకాలతో క్రీడాకారులు సత్తాచాటారని గుర్తు చేశారు. వన్డే ప్రపంచ కప్‌లో భారత క్రికెట్ జట్టు అందరి మనసులు గెలుచుకుందని ప్రశంసించారు. శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, ఇది అందరికీ గర్వకారణమని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత కోసం 'ఫిట్ ఇండియా'లో భాగంగా తీసుకున్న చర్యలను వెల్లడించారు. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, నటుడు అక్షయ్ కుమార్ తమ ఫిట్నెస్ రహస్యాలను పంచుకున్నారు.



ఆక్లాండ్‌లో కొత్త సంవత్సర వేడుకలు

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు
సిడ్నీ, ఆక్లాండ్‌లో ముందుగా.

న్యూఢిల్లీ : 2024 నూతన సంవత్సర వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హోరెత్తాయి. సిడ్నీ, ఆక్లాండ్ నగరాల్లో ఈ వేడుకలు ముందుగా ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్, ఆక్లాండ్‌లోని స్కై టవర్ వద్ద అద్భుతమైన బాణసంచా ప్రదర్శనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్ వంతెనపై సుమారు 12 నిమిషాలపాటు టన్నుల కొద్దీ బాణసంచా కాల్చారు. ఈ వేడుకను చూడ్డానికి ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులు వచ్చారు. ఆక్లాండ్‌లోని 328 మీటర్ల ఎత్తయిన కమ్యూనికేషన్స్ అండ్ అబ్జర్వేషన్ టవర్‌పై కాల్చిన బాణాసంచా నగరం మొత్తాన్ని వెలుగులతో నింపింది. వాటికన్ సిటీలో నూతన సంవత్సర వేడుకల ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 2023ను యుద్ధ బాధల సంవత్సరంగా పోప్ ఫ్రాన్సిస్ గుర్తు చేసుకున్నారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు ముందున్న కిటికీ నుంచి పోప్ సాంప్రదాయ ఆశీర్వాదం ఇచ్చారు. బాధించబడుతున్న ఉక్రెయిన్, పాలస్తీనా, ఇజ్రాయిల్, సూడాన్ ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల ప్రజల కోసం పోప్ ఫ్రాన్సిన్ ప్రార్ధనలు చేశారు. 'యుద్ధంలో ఎన్నో మానవ జీవితాలు ఛిద్రమయ్యాయి. ఎంతోమంది మరణించారు. ఎన్నో బాధలు, ఎంతో పేదరికాన్ని బాధితులు అనుభవిస్తున్నారు' అని పోప్ తెలిపారు.న్యూయార్క్ నగరంలో టైమ్స్ స్క్వేర్ వద్ద వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బెదిరింపులు రావడంతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. డ్రోన్లతోనూ నిఘా పెట్టారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నూతన వేడుకలకు భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. 2024లో పారిస్‌లో ఒలింపిక్స్ జరుగుతుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 2న ఈఫిల్ టవర్ వద్ద కత్తిపోట్ల సంఘటన చోటు చేసుకోవడంతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. జర్మనీ బెర్లిన్‌లోనూ వేడుకలకు భారీగా మోహరించారు. వీధుల్లో ఫైర్ క్రాకర్ల వాడకంపై అధికారులు నిషేధం విధించారు. పాలస్తీనా వాసులకు సంఘీభావంగా పాకిస్తాన్‌లో నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం నిషేధం విధించింది.





JEEVANA జీవన the family

భూనభోంతరాలు దద్దరిల్లిపోయేలా, ఆనంద సంబరాలు అంబరాన్ని తాకేలా ప్రియమారా నన్ను స్వాగతించినందుకు మీకు ప్రేమారా ధన్యవాదాలు. నిన్నటితో ముగిసిన సంవత్సరం వలె గిర్రున ఓ ఏడాది తిరిగే సరికి నేనూ పాతగిల్లిపోతాను. కాలప్రవాహంలో కలిసిపోతాను. ఈ ఏడాదే మీతో నాకు, నాతో మీకూ నిత్యానుబంధం. నిరంతర సంబంధం. సందళ్ల హంగామా మధ్య నేను రావడమూ, బైబైల వీడ్కోళ్ల మధ్య వచ్చే ఏడాది వెళ్లిపోవడమూ మామూలే. కాల ప్రహహంలో నేనొక గురుతును మాత్రమే! నా హయాంలో సాగే మీ కార్యాల, కార్యక్రమాల సాధన మాత్రమే మీకైనా, నాకైనా గుర్తింపునిస్తుంది.


మాయా కుండ



అనగనగా ఒక ఊరిలో రామయ్య అనే వ్యక్తి ఉండేవాడు. ఆయనకు కొంత పొలం ఉండేది. రామయ్య ప్రతిరోజూ పొలం పనులకు వెళ్లేవాడు. ఒకరోజు పొలం వద్దకు అడవి నుంచి వెళుతుండగా, ఒక కుండ దొరికింది. అది మామూలు కుండ కంటే కొంచెం భిన్నంగా ఉంది. దానిని ఇంటికి తీసుకెళ్లాడు. ఆ కుండను తీసుకెళ్లటం ఊళ్లో అందరూ చూశారు. ఎక్కడి నుంచి తెస్తున్నావు అని అడిగారు. అదేదో రహస్యం అన్నట్టు రామయ్య ఎవరికీ సమాధానం చెప్పలేదు. ఆ తరువాత ఆ కుండ గురించి ఊళ్లో ప్రచారం జరిగింది. అది మాయాకుండ అని, అందులో కొన్ని బియ్యం వేస్తే కొంతసేపట్లో నిండుగా అయిపోతాయని; ధనం ఉంచినా అది పెరిగిపోతుందని చెప్పుకోవడం మొదలు పెట్టారు. ఆ కొత్త కుండలో రామయ్య భార్య సీతమ్మ కొద్దిగా బియ్యం వేస్తే, నిండా అయిపోయాయని అందరూ కథలు కథలుగా చెప్పుకోవడం ఆరంభించారు. ఆ నోట ఈ నోట ఈ మాయా కుండ విషయం ఆ ఊరి జమిందారుకు చేరింది. అతడు అప్పటికే ఖజానాలో డబ్బు లేదని ప్రజల మీద చాలా పన్నులు వేశాడు. ప్రజలకు ఖర్చు పెట్టడం లేదని, దాచుకుంటున్నాడని కూడా ఊళ్లో ప్రచారం ఉంది. రామయ్య ఇంట్లో ఉన్న కుండ గురించి తెలుసుకొని, జమీందారు దానిని బలవంతంగా తీసుకుపోయాడు. తన ఇంట్లో ఉన్న కుండల మధ్య పెట్టాడు. అప్పుడే ఒక పిల్లి దబ్బున ఆ కుండపై దూకింది. దాంతో అది పగిలిపోయింది. పక్కనున్న కుండలు కూడా పగిలిపోయాయి. వాటిలో నుంచి బంగారు నాణాలు బయటపడ్డాయి. అవన్నీ ప్రజల నుంచి జమీందార్ దోచుకున్న సొమ్ము అని అక్కడున్న వారందరూ గ్రహించారు. మోసం బయటపడిందని జమీందార్ మౌనంగా తలదించుకున్నాడు. అప్పుడు రామయ్య ముందుకు వచ్చాడు. 'ఈ మోసం బయటపెట్టాలనే నేను మాయా కుండ నాటకం ఆడాను. నాకు దొరికింది మామూలు కుండే. అది అద్భుతాలు చేస్తుందని ఊరంతా నమ్మాలని నేను, నా భార్య ఇదంతా చేశాం. ఎట్టకేలకు ప్రజల సొమ్ము ప్రజల వద్దకే చేరింద'ని చెప్పాడు. మంచి పని చేశాడని గ్రామస్తులందరూ అతన్ని ప్రశంసించారు.



– శ్రీనివాస్, 6వ తరగతి,
హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా
80967 82088



జవాబు : 16

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ



బోయిని నందిని
8వ తరగతి,
జక్కాపూర్,
సిద్ధిపేటజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com

కొత్త సంవత్సరం.. కొన్ని కబుర్లు...

కొత్త సంవత్సరాన్ని కదా, గత ఏడాదులు వదిలి వెళ్లిన అనుభవాల నుంచి కొన్ని కబుర్లు చెబుతాను. 'ఔను' అనిపిస్తే ఆచరించండి. కనీసం ఆలోచించండి.

సోషల్ మీడియాతో జాగ్రత్త : సాంకేతిక పరిజ్ఞానం చేతి వేళ్ల మీద తారాడుతున్న తరుణం ఇది. క్షణక్షణానికి అనంతమైన సమాచారం వచ్చి పడుతుంది. 'కనినంతనే వేగపడక ..' అది నిజమో కాదో తెలుసుకోండి. మతాభిమానాన్ని దురాభిమానంగా మార్చటానికి కొన్ని దుష్టశక్తులు పని కట్టుకొని ప్రయత్నం చేస్తూ ఉండొచ్చు. అబద్ధాలతో లబ్ధి పొందాలనుకునే వ్యాపార శక్తులూ ఉండొచ్చు. ఏ వీడియో వెనుక ఏ ఉద్దేశం ఉందో, ఏ మెసేజీ లోపల ఏ మర్మం ఉందో శోధించండి. నమ్మకమైన వార్తాసంస్థల్లో ఆ సమాచారం వచ్చిందో లేదో వెతకండి. కుల, మత భావాలను ప్రేరేపించే ప్రతి సోషల్ మీడియా పోస్టునూ విస్మరించండి. అబద్ధాలను, అపార్థాలను సృష్టించమే కాదు; ప్రచారం చేయడం కూడా నేరమే!

తార్కికంగా ఆలోచించండి : మంత్రాలకు చింతకాయలు రాలవని మా తాతమ్మల సంవత్సరాల నాడే జనం ఒక నిర్ధారణకు వచ్చారు. గాల్లో దీపం పెట్టి, ఆరిపోకుండా రక్షించమంటే ఏ దేవుడూ రక్షించలేడని ఇంతగా చదువులు విస్తరించని రోజుల్లోనే మనుషులు గ్రహించారు. మనుషులు చేసే పనే అన్నిటికీ మూలమని అనుభవంలో తెలుసుకున్నారు. అలాంటి ఎన్నో విలువైన అనుభవాలు తాతయ్యలూ, నాన్నమ్మల దగ్గర ఉంటే– కొంతమంది చదువుకున్న కుర్రవాళ్లు చదువూ సంధ్యల్లేని సన్నాసుల మాయమాటలను ఎందుకు నమ్ముతున్నారో– మా తాజా సంవత్సరాలు వేటికీ అర్థం కావటం లేదు. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక చాలామంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అద్భుతంగా వాడుతున్నారు. కానీ, ఆ సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందడం వెనుక ఉన్న సైన్సుని విస్మరిస్తున్నారు. కొంతమంది అదే సైన్సు అందించిన ఉపకరణాలను వాడుతూ, విజ్ఞాన శాస్త్రాన్ని ఎద్దేవా చేస్తున్నారు. తార్కికంగా ఆలోచించండి. మాటల గారడీలో పడకండి. కార్యకారణ సంబంధం లేకుండా ప్రపంచంలో ఏ చిన్న మార్పూ జరగదు. తార్కికంగా ఆలోచించటం మొదలు పెడితే– అనవసర గందరగోళాలు ఉండవు. సమస్యల్లో సతమతం అయిపోరు. దానికో పరిష్కారాన్ని స్వయంగా మీరే కనిపెడతారు.

ప్రవృత్తి ఒకటి పెంపొందించుకొండి : మీ అందరికీ ఏవో పనులుంటాయి. చదువులు, ఉద్యోగాలు, సేవలు, గృహ నిర్వహణలూ ... ఇలా ఇలా. వాటిని పరిపూర్ణంగా, ఫలవంతంగా నిర్వర్తించటానికి మీరు నిరంతరంగా శ్రమిస్తారు. కానివ్వండి. కానీ, మీలో ఇంకేదో ఆసక్తి ఉండి ఉంటుంది. ఇంకా ఎంతో శక్తీ మిగిలి ఉంటుంది. నిరంతర వృత్తి నుంచి ఒకింత తెరిపిన పడటానికి మీలో దాగి ఉన్న అభిరుచి దోహదపడొచ్చు. రాయడమో, చదవడమో, బొమ్మలు గీయటమో, ఆటలు ఆడటమో ... ఇలా ఏదైనా కావొచ్చు. పాటలు చెప్పటమో, సేవ చేయటమో, కొండలు ఎక్కటమో, కథలు రాయటమో ... ఇంకా ఇలా ఇలా ఏవైనా ఉండొచ్చు. వాటికో రూపం ఇవ్వండి. వృత్తిని, ప్రవృత్తిని సమన్వయం చేసుకుంటూ సాగిపొండి. వృత్తి మీ భృతికి, అభివృద్ధికీ దోహదపడితే– ప్రవృత్తి మీలోని వైవిధ్యాన్ని వెలికి తీస్తుంది. మనసుకు హాయినిస్తుంది. ఆనందాన్నిస్తుంది.

పరిసరాలను పట్టించుకొండి : ప్రపంచం ఇంతింత అభివృద్ధి సాధించటానికి కారణం మానవులు కలసి మెలసి ఉండడమే! కలిసికట్టుగా సాగటమే! ఆలోచనలను నిరంతరంగా పంచుకుంటూ కార్యాచరణకు దిగటమే! కానీ, కలిసి ఉంటూ కూడా ఎవరి ఒంటరి ప్రపంచంలో వాళ్లు ఉండిపోవడమూ ఆధునిక కాలంలో పెరిగింది. ఎక్కడెక్కడో పని చేసి, ఆ పని ఆలోచనల్లోనే తలమునకలై, స్థానికంగా పరిసరాలను, చుట్టుపక్కలను పట్టించుకోవడం తగ్గింది. ఆ పరిస్థితిని మార్చటానికి మీ వంతుగా మీరు కొంత ప్రయత్నం చేయండి. మీ వీధి అధ్వాన రోడ్డు గురించి ఆరా తీయండి. మీ కాలనీ పార్కును మెరుగుపర్చటానికి ఏం చేయొచ్చో తోటి వారితో చర్చించండి. మీ చుట్టుపక్కల పిల్లలకు లెక్కలో, ఇంగ్లీషో చెప్పే సామర్థ్యం ఉంటే ఆ పని మీరే చేయండి. మీ కార్యక్షేత్రాల్లో, ఇంట్లో మాత్రమే కాదు; మీ నివాస ప్రాంతాల్లోనూ అందరికీ తెలిసేలా మసలండి. ఉపయోగపడేలా గడపండి.

మీ అభిప్రాయాలు పంచుకొండి : సమాజం పాడైపోయిందనో, పాడైపోతుందనో మీలో చాలామందికి ఫిర్యాదులు ఉంటాయి. అసంతృప్తులు ఉంటాయి. దానిని బాగుచేయటానికి చాలా ఆలోచనలు ఉంటాయి. అభిప్రాయాలు ఉంటాయి. వాటిని మీలోనే దాచేసుకోకండి. అవకాశం ఉన్న చోట పంచుకొండి. సమాజంలో మీరొక్కరే బాగా ఆలోచిస్తున్నారని, మిగతా వాళ్లు పట్టించుకోవడం లేదని అనుకోకండి. మీలా ఆలోచించేవాళ్లు ఇంకా చాలామంది ఉండొచ్చు. సంస్థలుగానో, వ్యక్తుల బృందాలుగానో ఇప్పటికే అలాంటి కృషి చేస్తూ ఉండొచ్చు కూడా. మీరూ కలవండి. చేతులు కలపండి. మీ అభిప్రాయం, ఆచరణ నలుగురితో పంచుకొండి. ఏదీ బాగోలేదని బాధపడడం, కోప్పడడం సులభం. మీరూ ఈ సమాజంలో భాగమే కదా! మరి బాగు చేయడానికి, మరింత మెరుగుచేయటానికి మీరు ఎంతో కొంత తోడ్పడండి. అలాంటి కార్యాచరణ ఒకటి నా హయాంలో మీరే స్వయంగా తలకెత్తుకొండి. మీలాంటి ఆలోచనాపరుల ఉమ్మడి ఆచరణ ఫలితంగానే ఇటీవల అనేక జిల్లాల్లో బాలోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

మిత్రమా, కాలం ఎప్పుడూ ఖాళీ పత్రమే! మంచో చెడ్డో దానిపై మీరే రాయాలి. సంవత్సరమనేది ఒక సంకేతం మాత్రమే. సాధనా, శోధనా మీరే అవ్వాలి. నిన్న నువ్వు దిద్దిందే రేపటి రూపం. నేడు నువ్వు నడిచిందే రేపు చేరే గమ్యం. అక్కడి నుంచే, అక్కర నుంచే మీ ప్రయత్నం మొదలవుతుంది, మొదలవ్వాలి.

నేనొక గురుతుగా, సాక్షిగా మీరెన్నెన్నో సాధించాలని మనసారా ఆశిస్తూ ... మీకు బోలెడు శుభాకాంక్షలు.

ఇట్లు మీ **2024**



రంగవల్లి

15 చుక్కలు 8 వచ్చేవరకు
(మధ్య చుక్క)



కాసర. లక్ష్మీ
సరోజారెడ్డి,
జంగారెడ్డి గూడెం.

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

ఈ ఏడాది సందడే సందడి





ఈ ఏడాది ఆరంభం నుండి సినిమా ప్రేక్షకులకు గొప్ప పండగ వాతావరణం కనపడుతోంది. సంక్రాంతి, వేసవి, దసరా, దీపావళి ఇలా ప్రతి పండగకు వరుసగా పెద్ద హీరోల సినిమాలు విడుదలవుతున్నాయి. ముందుగా సంక్రాంతి పండగకు 'గుంటూరు కారం'తో మహేష్‌బాబు, 'నా సామిరంగ'తో నాగార్జున, 'సైంధవ్'తో వెంకటేష్, 'ఈగల్'తో రవితేజ వంటి పెద్ద నటులు పోటీపడుతుంటే, కుర్ర హీరో తేజ సజ్జా కూడా 'హనుమాన్'తో వచ్చేస్తున్నాడు. తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ హీరో ధనుష్ కూడా ఈ సంక్రాంతికి 'కెప్టెన్ మిల్లర్'తో పలకరిస్తున్నాడు. ఈ సినిమాల మధ్యలో 'సర్కారు నౌకరి' అంటూ సింగర్ సునీత తనయుడు డెబ్యూ మూవీతో వస్తున్నాడు. 'తంగలాన్' అంటూ విక్రమ్, రోహిత్ 'ప్రతినిధి–2', రజనీకాంత్ 'లాల్ సలామ్'తో వస్తున్నారు. థియేటర్ల సర్దుబాటు కాక కొన్ని సినిమాలు పండగ బరి నుండి తప్పుకున్నా, జనవరిలోనే విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

ఫిబ్రవరిలో 'టిల్లు స్క్వేర్'తో సిద్ధు జొన్నలగడ్డ, వరుణ్‌తేజ్ 'ఆపరేషన్ వాలంటైన్', సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన'తో సిద్ధంగా ఉన్నారు. ఇక మార్చిలో విజయ్‌దేవర కొండ 'ఫ్యామిలీస్టార్'తో వస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' అంటూ రామ్ కూడా మార్చికే రెడీగా ఉన్నారు. విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'తో వస్తున్నారు.

వేసవి జాతర

ఇక వేసవిలో ఎన్‌టిఆర్ అభిమానులు తెగ సంబరపడిపోయేలా 'దేవర' చిత్రం విడుదలవుతోంది. ఎన్‌టిఆర్, కొరటాల కాంబినేషనల్లో ఏప్రిల్‌కి వస్తోందీ చిత్రం. అలనాటి సీనియర్ హీరోయిన్ శ్రీదేవి కూతురు జాహ్నవి కపూర్ ఈ చిత్రంతో తెలుగు తెరకి పరిచయమవుతోంది.

అలాగే వైజయంతి మూవీస్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ప్రభాస్ నటించిన 'కల్కి 2898ఎడి' చిత్రం మే నెలలో విడుదల చేస్తామని చిత్రబృందం గతంలోనే ప్రకటించింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దుల్కర్ సల్మాన్ వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు.

అలాగే శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా చేసిన 'గేమ్ చేంజర్' కూడా వేసవికి సిద్ధమైంది. ఇంకా రిలీజ్ డేట్ ప్రకటించని ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కియారా అద్వానీ, ఎస్‌జె సూర్య, అంజలి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇలా వేసవికి కూడా పెద్ద హీరోల సినిమాలు క్యూ కట్టాయి.

పోటీ లేకుండా

వరుసగా అందరు స్టార్లు బాక్సాఫీసు బరిలో నిలుస్తుంటే ఎప్పుడో షూటింగ్ మొదలుపెట్టిన 'పుష్ప–2' మాత్రం ఆగష్టులో విడుదలకు సిద్ధమై తనకు పోటీ లేకుండా చేసుకుంటోంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న ఈ చిత్రం 'పుష్ప'కి సీక్వెల్‌గా తెరకెక్కుతోంది.

శరవేగంగా చేస్తున్నారు..

పవన్‌కళ్యాణ్ నటిస్తున్న 'హరిహరవీరమల్లు', 'ఓజీ' చిత్రాలను కూడా ఈ ఏడాదే విడుదల చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా మొదలుపెట్టిన చిత్రాల షూటింగులు కూడా శరవేగంగా జరిగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతోన్న ఎన్‌బికె–109 కూడా 2024కి సిద్ధం చేస్తున్నారు. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్టతో చిరంజీవి చేస్తున్న 'మెగా–156' షూటింగ్ కూడా వేగంగా సాగిపోతోంది. వివేక్ ఆత్రేయతో నానీ మొదలుపెట్టిన 'సరిపోదా శనివారం' చిత్రం కూడా ఈ ఏడాదే విడుదల చేయాలని చూస్తున్నారు. ఆగస్టుకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' చిత్రీకరణ కూడా తాజాగా మొదలైంది. 2024లోనే విడుదల చేయాలని చిత్రబృందం ఆలోచిస్తోంది.

పరభాషా చిత్రాలు కూడా..

వీళ్లందరితో పాటు తమిళ హీరోలు కూడా ఈ ఏడాది తెలుగు అభిమానులను ఖుషీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ధనుష్, రజినీకాంత్‌తో పాటు 'అయలాన్' అంటూ శివకార్తికేయ వస్తున్నారు. సూర్య 'కంగువ'తో బరిలోకి దిగుతున్నారు. కమల్ అభిమానులు ఎప్పటి నుండో ఎదురుచూస్తున్న చిత్రం 'ఇండియన్ –2'. కమల్‌హాసన్, శంకర్ కాంబినేషనల్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇది కూడా ఈ ఏడాదే విడుదల చేయాలని చిత్రబృందం శరవేగంగా షూటింగ్ చేస్తోంది. మలయాళం, కన్నడ చిత్రాలు కూడా ఈ ఏడాదికి ముస్తాబవుతున్నాయి. మోహన్‌లాల్, మమ్ముట్టి, రిషబ్‌శెట్టి, ఫాహద్ ఫాజిల్ వంటి ప్రముఖ నటీనటులు ప్రేక్షకులను అలరించనున్నారు. ఇలా ఈ ఏడాదంతా సినిమా జాతర కనిపిస్తోంది.

















స్టేడియం ఎక్కడ?



- పార్క్‌లో భారత్ - పాక్ మ్యాచ్ షెడ్యూల్
- ఇంకా మొదలవని స్టేడియం నిర్మాణం పనులు
- మరో ఆరు నెలల్లో 2024 టీ20 ప్రపంచకప్

న్యూయార్క్ : భారత్–పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అనగానే క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తారు. ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడినా స్టేడియం కిక్కిరిసిపోవటంతో పాటు టెలివిజన్, డిజటల్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డులు నమోదవుతాయి. ఈ మెగా మ్యాచ్‌కు ఆతిథ్యం అందించే భాగ్యం దక్కటమో పెద్ద విషయం. ఐసీసీ టోర్నీల్లో భాగంగా ఏ దేశంలో భారత్, పాక్ తలపడినా అత్యుత్తమ సౌకర్యాలు, అత్యధిక సీటింగ్ కెపాసిటీ కలిగిన స్టేడియంనే వేదికగా ఎంపిక చేస్తారు. కానీ తొలిసారి అసలు స్టేడియమే లేని చోట భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. అందుకు మరో ఆరు నెలల్లో ఆరంభం కానున్న ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ వేదిక కానుంది. ఈ విషయం క్రికెట్ అభిమానులను కాస్త షాక్‌కు గురి చేసినా.. ఇదే కఠోర వాస్తవం.

ఫిబ్రవరిలో నిర్మాణం మొదలు! : భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్ న్యూయార్క్‌లో జరగనుందని ఐసీసీ ఇటీవల షెడ్యూల్ ప్రకటిస్తూ.. గొప్పగా ప్రచారం చేసింది. ఇరు దేశాల అభిమానులు సైతం న్యూయార్క్‌లో దాయాదుల ధనాధన్‌పై భారీగా అంచనాలు పెంచుకున్నారు. కానీ తీరా చూస్తే.. అసలు ఈసన్‌హెూవర్ పార్క్‌లో ఎటువంటి స్టేడియం లేదు. ప్రస్తుతానికి అక్కడ మార్నింగ్, ఈవెనింగ్ వాకింగ్ చేసేందుకు స్థానికులు వస్తున్నారు. క్రికెట్‌కు సంబంధించి ఎటువంటి కార్యకలాపాలు జరుగటం లేదు. కనీసం క్రికెట్ పిచ్ కూడా లేదు. ఇటువంటి చోట భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేయటంపై సోషల్ మీడియాలో అభిమానులు మండిపడుతున్నారు. ప్రపంచకప్‌కు మరో ఆరు నెలల సమయం ఉంది. ఫిబ్రవరిలో స్టేడియం నిర్మాణం పనులు ఆరంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

అసలు జరుగుతుందా? : అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఎంత వేగంగా చేపట్టినా కనీసం 40 నెలల సమయం పడుతుంది. కాన్సెప్ట్, డిజైన్, కన్‌స్ట్రక్షన్‌లకు కలుపుకుంటే మరింత అధిక సమయం తీసుకుంటుంది. ప్రస్తుతానికి ఈసన్‌హెూవర్ పార్క్ సాధారణ ఓ ఖాళీ స్థలమని చెప్పవచ్చు!. క్రికెట్ పిచ్‌లు రూపొందించటం పెద్ద కష్టం కాదు. కానీ కనీసం 34 వేల మంది కూర్చునేందుకు అనువైన స్టేడియం నిర్మాణానికి కనీస సమయం పడుతుంది. ఈ విషయం ఐసీసీ పెద్దలకు తెలియనిది కాదు. అయినా, స్టేడియం లేని చోట భారత్, పాక్ మ్యాచ్‌కు షెడ్యూల్ చేసింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ సహా బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ వంటి స్టార్ క్రికెటర్లు మరో ఆరు నెలల్లో ఇక్కడే సాధన చేయనున్నారు. నాలుగు నెలల్లో స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తారా? అనే అనుమానం అంతటా నెలకొంది. లేదంటే ఆఖరు క్షణంలో వేదికను ఫ్లోరిడా లేదా కరీబియన్ దీవులకు మార్పు చేసేందుకు అవకాశం లేకపోలేదు.

డిసైడర్‌లో కివీస్ గెలుపు

బంగ్లాతో టీ20 సిరీస్ సమం



మౌంట్‌మౌంగానుయ్ : న్యూజిలాండ్ గడ్డపై చారిత్రక సిరీస్ విజయం సాధించాలనే పట్టుదల ప్రదర్శించిన బంగ్లాదేశ్‌కు కివీస్ చెక్ పెట్టింది. నిర్ణయాత్మక మూడో టీ20లో గెలుపొందిన న్యూజిలాండ్ టీ20 సిరీస్‌ను 1–1తో సమం చేసింది. వర్షం ప్రభావిత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గి తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్.. బంగ్లాదేశ్‌ను 19.2 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూల్చింది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (4/16) మ్యాజిక్‌కు తోడు సౌథీ, మిల్నె, సీయర్స్ రెండేసి వికెట్లతో చెలరేగారు. బంగ్లా తరపున శాంటో (17), తౌహిద్ (16), అఫిఫ్ (14) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఛేదనలో కివీస్ 14.4 ఓవర్లలో 5 వికెట్లకు 95 పరుగులు చేసింది. సీఫర్ట్ (1), మిచెల్ (1), చాప్‌మన్ (1), ఫిలిప్స్ (1) విఫలమైనా.. ఓపెనర్ ఫిన్ అలెన్ (38), జేమ్స్ నీషమ్ (28 నాటౌట్), మిచెల్ శాంట్నర్ (18 నాటౌట్)లు కివీస్‌ను ముందంజలో నిలిపారు. మరో 32 బంతుల్లో 16 పరుగులు అవసరమైన దశలో వర్షం ఆటకు అడ్డు తగిలింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో న్యూజిలాండ్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. మిచెల్ శాంట్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

మెస్సి కాదు కోహ్లి

ఫ్యాబిటి అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సొంతం



న్యూఢిల్లీ : ప్రపంచ స్పోర్ట్స్ స్టార్స్ లియోనల్ మెస్సి, విరాట్ కోహ్లి. ఫుట్‌బాల్ రారాజు మెస్సి కాగా.. క్రికెట్‌లో కింగ్ విరాట్ కోహ్లి. మరి ఈ ఇద్దరు దిగ్గజాలు ఓ అవార్డు రేసులో నిలిస్తే ఏంటీ పరిస్థితి!. ఫ్యాబిటి అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రేసులో లియోనల్ మెస్సిని వెనక్కి నెట్టిన విరాట్ కోహ్లి.. ప్రతిష్టాత్మక పురస్కారం దక్కించుకున్నాడు. నొవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాజ్, లెబ్రాన్ జోన్స్, మాక్స్ వెర్‌స్టాపెన్‌లు సైతం రేసులో నిలిచినా.. అంతిమంగా అవార్డు కోసం మెస్సి, కోహ్లి నడుమ పోటీ నెలకొంది. ఓటింగ్‌లో అవార్డును విన్నర్‌ను తేల్చగా.. కోహ్లి ఏకంగా ఐదు లక్షల ఓట్లతో అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. 2023 ఏడాదిని కోహ్లి గొప్పగా ముగించాడు. టెస్టులు, వన్డేల్లో ఎదురులేని రికార్డులు నెలకొల్పాడు. వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలువటంతో పాటు 50 వన్డే శతకాల రికార్డును సైతం నెలకొల్పాడు. మరోవైపు 2022 ఫిఫా ప్రపంచకప్ విజయానంతరం మెస్సి పెద్దగా ఏం చేయలేదు. ఈ ఏడాది అమెరికాకు వచ్చిన మెస్సి.. డెవిడ్ బెక్‌హామ్ యాజమాన్యంలోని ఇంటర్ మియామి తరపున ఆడుతున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68